ఎయిర్ పొల్యూషన్‌కు చెక్.. కార్బన్ గార్డెన్..



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం


గుంటూరు - శుక్రవారం 27 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 81 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



120 జిల్లాల్లో ప్రభుత్వ డ్రైవింగ్ స్కూళ్లు



2




# అమరావతి రాజధానికి చట్టబద్ధత

## క్యాబినెట్‌లో తీర్మాణం

28న అసెంబ్లీలో, 4న పార్లమెంట్ లో


ప్రధాని మోదీ సూచనల మేరకు కదలిక

అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి): చట్టబద్ధత కలిగిన ప్రజా రాజధానిగా అతి త్వరలో అమరావతి ఆవిర్భవించనుంది. దీనికి ఏపీ క్యాబినెట్లో తీర్మానం ఆమోదం కూడా అయిపోయింది. దీనిని వెంటనే కేంద్ర హోం శాఖకు పంపించడమే కాదు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనల మేరకు ఏపీ అసెంబ్లీలో ఆమోదం, వెంటనే పార్లమెంటులో చట్టం కూడా అయ్యేలా కార్యాచరణ రూపొందించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని

...మిగతా 2లో

## ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

శ్రీరామనవమి మహోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు. ధర్మానికి, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడు శ్రీరాముడు. ఆయన అవతరించిన రోజు, ఆయన కళ్యాణం జరిగిన రోజు మనం శ్రీరామనవమి వేడుకలను జరుపుకుంటాం. శ్రీరాముడు అంటేనే ప్రజారంజక పాలన. అలాంటి రామరాజ్యాన్ని స్థాపించుకోవడానికి మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. శ్రీరామచంద్రమూర్తి సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శ జీవితం గడపాలని, మీకు మీ కుటుంబానికి ఆ శ్రీరాముడి కృపాకటాక్షం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శ్రీరామనవమి శుభాకాంక్షలు.



## రజత కాంతుల్లో మెరిసిపోతున్న ఒంటిమిట్ట

శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవ శోభ



ఒంటిమిట్ట/తిరుపతి, మార్చి 26: ఒంటిమిట్టలోని పవిత్రక్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల హృదయాలను పరవశింపజేసేలా టిటిడి అత్యంత వైభవంగా విద్యుత్ అలంకరణలను చేపట్టింది. వెన్నెలను తలపించే వెలుగుల మధ్య ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసరింపజేస్తూ భక్తులకు దివ్యానుభూతిని అందిస్తున్నాయి. ఒంటిమిట్ట ఆలయం లోపల మరియు వెలుపల ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, టిటిడి భవనం, వాహన మండపం,

...మిగతా 2లో



## సచివాలయంలో అచ్చెన్న హ్యాపీ బర్త్ డే!

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రశంసల వర్షం

అమరావతి, మార్చి 26,(మనం ప్రత్యేక ప్రతినిధి): ఒక పక్క క్యాబినెట్ మీటింగ్... రాజధాని అమరావతికి చట్టబద్ధతపై కీలక చర్చ. ఆ మీటింగ్ కాగానే, అంతా బర్త్ డే మూడ్ లో కి వచ్చేశారు. అదే వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు. అమరావతిలోని సచివాల యంలో సీఎం ఛాంబర్లో మంత్రుల సమక్షంలో ఘనంగా

...మిగతా 2లో

## విద్యకు పెద్దపీఠ

కూటమి పాలనలో విద్యార్థుల బంగారు భవితకు నిలయాలుగా అంబేద్కర్ గురుకులాలు

విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసిన మంత్రి డా.స్వామి



అమరావతి,మార్చి,26,(మనం ప్రత్యేక ప్రతినిధి): డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష (BRAGCET 2026) ఫలితాలు గురువారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర సాంఘిక

...మిగతా 2లో

## ష్...గప్‌చుప్..!!!

సీఎంలతో పీఎం 'సన్నద్ధత' సమావేశం

2



మార్కాపురం సమీపంలో ఘోరరోడ్డు ప్రమాదం

# నిద్రలోనే అనంతలోకాలకు

## 14 మంది మృతి 29 మంది సురక్షితం.. పలువురికి గాయాలు

- అతివేగమే బస్సు ప్రమాదానికి కారణం
- ప్రమాదానికి గురైన పూర్తిగా కాలిపోయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సహాయక చర్యల్లో పాల్గొన్న మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్
- ప్రమాద ఘటనపై దర్యాప్తు వేగవంతం






మార్కాపురం,మార్చి,26,(మనం న్యూస్): మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో చోటుచేసుకున్న ఘటనపై మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగిత్యాల నుండి కలిగిరి వెళ్ళు హరికృష్ణ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అఖ20ఌ0487 లో 43 మంది ప్రయాణికులు, డ్రైవర్లు ఇద్దరూ మొత్తం 45 మార్కాపురం,రాయవరం వద్దకు వచ్చేసారికి ఉదయం తెల్లవారుజామున సుమారు 5.45 గంటల సమయంలో పొదిలి వైపు నుండి కంకర్ టిప్పర్ నెంబర్ అ్క 39ఇ 5265 ను ఢీకొని దగ్ధమైంది.ఈ ఘటనలో 14 మృతి చెందగా 29 మంది సురక్షితంగా బయటపడ్డారు. పలువురు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తర్వాత బస్సుకు మంటలు వ్యాపించాయి. బస్సు అద్దాలను పగులగొట్టడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న జిల్లా ఎస్పీ గారు వెంటనే సంఘటనా స్థలానికి ఫైర్

...మిగతా 2లో

## మార్కాపురం బస్ ప్రమాదంపై సీఎం సీరియస్

ప్రైవేట్ ట్రావెల్స్ నిర్లక్ష్యంపై దర్యాప్తు



మార్కాపురం , మనం న్యూస్: మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో చోటుచేసుకున్న ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ప్రైవేట్ బస్ నిర్వహణ లోపంతోనే ప్రమాదం జరిగిందనే

...మిగతా 2లో



## మన 'చమురు' నౌకలకు ఫ్రీ ప్యాసేజ్

టెహ్రాన్, మార్చి 26: భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. ఈ విషయాన్ని ముంబయిలోని ఇరాన్ కాన్సు లేట్ జనరల్ కార్యాలయం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. 'మేము హర్మూజ్ నుంచి

...మిగతా 2లో

## రంగంలోకి రష్యా?

ఇరాన్‌కు డ్రోన్లు, ఆహారం ఔషధాలు

అందజేస్తున్న పుతిన్ సర్కార్

రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ సహకారం కూడా!

2



2

పారిశ్రామికవేత్తలుగా వడ్డెర్లు

## భరోసే మా లక్ష్యం

వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం కేటాయింపులు

సీనరేజీలో 50 శాతం మినహాయింపు బిల్లుకు కేబినెట్‌లో ఆమోదం

ఈ బిల్లుతో వడ్డెర్లకు ఆర్థిక మేలు అంటూ మంత్రి సవిత హర్షం

సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కు, మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు




2

## పవిత్ర హజ్ యాత్రకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి

ఏప్రిల్ 18,19 తేదీల్లో పవిత్ర హజ్ యాత్రకు సన్నాహాలు

హజ్-2026 యాత్ర సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహణ

ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా హజ్ ఏర్పాట్లు ఉండాలి



## తాప్సీ ఉపాధ్యాయకి మంత్రి సత్యకుమార్ అభినందనలు

అమరావతి, మార్చి,26,(మనం ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం సచివాలయంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య చైతన్యం కోసం కృషి చేస్తున్న యువతీ తాప్సీ ఉపాధ్యాయను సత్కరించి, అభినందించారు. మీరట్ (ఉత్తరప్రదేశ్) నుంచి మిషన్ హెల్దీ భారత్ - ఒబేసిటీ ముక్త్ భారత్ బ్రై యాత్ర మార్చి 9, 2025న ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు 17,400 కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేశారు. ఇప్పటివరకు 500 విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు, అలాగే లక్ష్యంగా పెట్టుకున్న 28 రాష్ట్రాలలో

...మిగతా 2లో



## తిరుపతి ఎస్.ఐ.హెచ్.ఎం సిబ్బంది వేతన కష్టాలకు తెర

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చొరవతో రూ.84 లక్షల బకాయిలు విడుదల

గత ప్రభుత్వ వైఖరితో 22 నెలలుగా నిలిచిన జీతాల సమస్య పరిష్కారంపై హర్షాతిరేకాలు

సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ ని కలిసి కృతజ్ఞతలు తెలిపిన టీచింగ్ మరియు నాన్-టీచింగ్ సిబ్బంది

కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సిబ్బంది

అమరావతి/తిరుపతి,మార్చి,26,(మనం ప్రత్యేక ప్రతినిధి): తిరుపతిలోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సిబ్బంది సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న వేతన సమస్యకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

...మిగతా 2లో

## జిజిహెచ్‌లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

- పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి
- కేంద్ర మంత్రి పెమ్మసాని



గుంటూరు, మార్చి, 26,(మనం న్యూస్): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని,జిజిహెచ్ లో గతం కంటే మెరుగైన వైద్యం అందించే దిశగా కృషి చేస్తున్నామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ లో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన హెచ్ డి యస్ కమిటీ సభ్యులతో కలెక్టర్ తమీం అన్సారియా , తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

...మిగతా 2లో

## మార్కాపురం బస్ ప్రమాదంపై సీఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

కోణంలో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. మార్కాపురం జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, దీనితో దర్యాప్తు ముమ్మరం చేశారు. జగిత్యాల నుండి కలిగిరి వెళ్ళు హరికృష్ణ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అఖ20ఌ0487 లో 43 మంది ప్రయాణికులు, డ్రైవర్లు ఇద్దరూ మొత్తం 45 తో బయలుదేరింది. మార్కాపురం, రాయవరం వద్ద కు వచ్చేసరికి బండి సాంకేతిక లోపంతో ఉదయం తెల్లవారుజామున సుమారు 5.45 గంటల సమయంలో పొదిలి వైపు నుండి కంకర్ టిప్పర్ నెంబర్ అ్క 39ఇ 5265 ను ఢీకొని దగ్ధమైంది. ఈ ఘటనలో 14 మృతి చెందగా 29 మంది సురక్షితంగా బయటపడ్డారు. పలువురు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తర్వాత బస్సుకు మంటలు వ్యాపించాయి. బస్సు అద్దాలను పగులగొట్టడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న జిల్లా ఎస్పీ వెంటనే సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజిన్లు మరియు అంబులెన్సులను పంపించి, తాను కూడా అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలిస్తూ రెస్క్యూ టీంతో కలిసి సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించామని తెలిపారు. బస్సు కిటికీలో నుంచి దూకిన కొందరు ప్రయాణికులకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి క్షతగాత్రులను పరామర్శించి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. అక్కడి ప్రయాణికులతో మాట్లాడి కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు సురక్షితంగా వారి ప్రదేశాలకు వెళ్ళుటకు తగిన ఏర్పాటు చేశారు. హోమ్ మంత్రి అనిత ప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రధాని మోదీ కూడా ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## తాప్సీ ఉపాధ్యాయకి మంత్రి సత్యకుమార్ అభినందనలు

(మొదటి పేజీ తరువాయి)

16 రాష్ట్రాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు మంత్రి కి ఆమె వివరించారు. సేవ్ ది నేషన్ - స్వస్థ భారత్ అనే లక్ష్యంతో బ్రై దేశమంతా పర్యటిస్తున్న ఈ యాత్ర మంచి రీతిలో కొనసాగాలని, యువత, ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం మరింత పెరగాలని మంత్రి సత్యకుమార్ ఆకాంక్షించారు.

**ప్రధానమంత్రి**

నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో దేశం మొత్తం ఆరోగ్యవంతమైన భారత్గా మారుతుందనే విశ్వాసం తనకు ఉందని మంత్రి తెలిపారు.

## విద్యకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విడుదల చేశారు. 2026 - 27 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ఖాళీగా ఉన్న 15,020 సీట్లు, జూనియర్ ఇంటర్ లో 13,840 సీట్లకు 01.03.2026 ప్రవేశ పరీక్ష నిర్వహించారు. వీటితో పాటు 6,7,8,9,10 తరగతుల్లో ఖాళీలకు 08.03.2026 వ తేదీన పరీక్ష నిర్వహించారు. 5 తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాల కోసం మొత్తం 1,15,313 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,01,799 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. గురువారం విడుదల చేసిన ఫలితాల్లో వీరిలో 88.27 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల విడుదల చేసిన అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ..అడ్మిషన్లకు పెద్ద మొత్తంలో దరఖాస్తులు రావడం అంబేద్కర్ గురుకులాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకున్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం. కూటమి పాలనలో పేద విద్యార్థుల బంగారు భవితకు నిలయాలుగా అంబేద్కర్ గురుకులాలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకులాల్లో నాణ్యమైన విద్య బోధనా, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. రాష్ట్రంలో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10 కి పెంచాం. ఐఐటీ, నీట్ లో తృటిలో అర్హత కోల్పోయిన వారికి లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నాం. గురుకుల్లాలో ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ తో పాటు దేశంలో, రాష్ట్రంలో ప్రసిద్ధ యూనివర్సిటీలు, విద్యాసంస్థలకు దరఖాస్తులు చేయించి వాటిలో సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నాం.

## మన 'చమురు' నౌకలకు ఫ్రీ ప్యాసేజ్


(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణించేందుకు మిత్ర దేశాలకు అనుమతులు ఇస్తున్నాం. వీటిలో చైనా, రష్యా, భారత్, ఇరాక్, పాకిస్థాన్ ఉన్నాయి' అని అరాగ్చీ ప్రకటించినట్లు అది పేర్కొంది. దీంతో హర్మూజ్ జలసంధికి ఇరువైపులా చిక్కుకుపోయిన భారత్ నౌకలు సరకులతో తమ గమ్యస్థానాలు చేరేందుకు మార్గం సులువైంది. ఇప్పటికే ఐదు గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్ వద్ద అనుమతుల కోసం ఎదురుచూస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.
ఇరాన్ నిర్ణయంతో వీటి ప్రయాణంపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరిన్ని చమురు నౌకలు దేశానికి వచ్చే అవకాశముంది.

## నిద్రలోనే అనంతలోకాలకు

(మొదటి పేజీ తరువాయి)

ఇంజిన్లు మరియు అంబులెన్సులను పంపించి, తాను కూడా అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలిస్తూ రెస్క్యూ టీంతో కలిసి సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించామని తెలిపారు. అనంతరం బస్సు కిటికీలో నుంచి దూకిన కొందరు ప్రయాణికులకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి క్షతగాత్రులను పరామర్శించి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. అక్కడి ప్రయాణికులతో మాట్లాడి కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు సురక్షితంగా వారి ప్రదేశాలకు వెళ్ళుటకు తగిన ఏర్పాటు చేయడం జరిగింది.



## అమరావతి రాజధానికి చట్టబద్ధత

(మొదటి పేజీ తరువాయి)

గతంలో కేంద్రాన్ని ప్రభుత్వం కోరింది. అయితే న్యాయపరమైన చిక్కులపై అనేక ప్రశ్నలు సంధించిన కేంద్ర హోంశాఖ సూచనలకు అనుగుణంగా చర్యలు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం క్యాబినెట్లో స్పష్టమైన తీర్మానం చేసింది. ఇదే అంశంపై 28న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానానికి ఆమోదం తెలపనుంది. ఈ బిల్లును కేంద్రానికి పంపనుంది.

కేంద్ర న్యాయ శాఖ నుండి వచ్చిన ఆదేశాల మేరకు తీర్మానం పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తీర్మానం తొలుత హోంశాఖకు అక్కడ నుండి న్యాయశాఖకు అక్కడనుండి బిల్లు రూపంలో పార్లమెంటుకు వెళ్ళనుంది. అక్కడ ఆమోదం పొంది రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. అక్కడ రాజముద్ర పడితే అమరావతికి చట్టబద్ధత వస్తుంది. అదే జరిగితే దేశంలో చట్టబద్ధత కలిగిన పార్లమెంట్లో ఆమోదం పొందిన ఏకైక రాజధానిగా అమరావతి నిలుస్తుంది.

భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా సిఆర్డిఏ ప్రాంతానికి సంబంధించిన అంశాన్ని కూడా ఈ బిల్లులో ప్రస్తావించనున్నట్టు సమాచారం. అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ తీర్మానం చేసేందుకు మార్చి 28, 2026న అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. కేంద్ర ప్రభుత్వం అమరావతికి చట్టబద్ధమైన హోదా కల్పించే ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలో, రాష్ట్ర మరియు కేంద్ర చట్టాల మధ్య సమన్వయం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు 109 సంస్థలకు సుమారు 1,298 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇపుడు రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా తీర్మానించారు. కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని నిర్ణయించారు.

## జిజిహెచ్‌లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

(మొదటి పేజీ తరువాయి)

అహ్మద్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ జిజిహెచ్ అభివృద్ధి కి సంబంధించిన పెండింగ్ అంశాలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించాము. తులసి రామ్ చంద్ర ప్రభు ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న ఎంసిహెచ్ బ్లాక్ 50% ఇప్పటికే పూర్తయింది. పెట్ స్కాన్ రూ. 18కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసింది.

దానిని కూడా మరో 2-3 వారాల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. పలు పత్రికల్లో వచ్చిన ఎఎప్ లో ఇచ్చాను తిన్నావు ఎదురవుతున్న పలు సమస్యలపై అధికారులు, సూపరిండెంట్ తో మాట్లాడి, సమస్యలకు సంబంధించిన పరిష్కారాలపై పలు సూచనలు చేశాము.

అవసరానికి మించి బెడ్లు ఎఎప్ లో అవసరం అవుతున్నాయి. ఓవర్ లోడ్ కారణంగా బెడ్ల కొరత సమస్య తలెత్తుతుంది. సమస్యలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, పరిష్కరించే హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గతంలో ఎప్పుడూ లేనివిధంగా సిఎస్ఆర్ నిధులతో అనేక అభివృద్ధి పనులను చేసి చూపిస్తున్నాం. అందుబాటులో లేని మెడిసిన్స్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాము. అత్యాధునికమైన సౌకర్యాలతో నెట్కో ద్వారా క్యాన్సర్ పేషంట్స్ కి వైద్య సేవలను అందిస్తున్నాం. కార్పొరేట్ వైద్య సేవలకు ధీటుగా పభుత్వ వైద్యశాలలో ప్రజలకు అందిస్తాము.

## రజత కాంతుల్లో మెరిసిపోతున్న ఒంటిమిట్ట

(మొదటి పేజీ తరువాయి)

ఆలయం ముందు గార్డెన్, ప్రధాన కూడళ్ళు, అలాగే ఒంటిమిట్ట నుండి మాధవవరం వరకు మార్గమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు మాడ వీధులు, పుష్కరిణి, పార్కింగ్ ప్రాంతం, ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలు, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలు రాత్రివేళల్లో రజత కాంతులతో మెరిసిపోతూ బ్రహ్మోత్సవాలకు అపూర్వమైన శోభను చేకూర్చుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా 30కి పైగా దేవతామూర్తుల పెద్ద బొమ్మలు, 70కు పైగా ప్రత్యేక డిజైన్ బోర్డులు, అలాగే అనేక అద్భుత ఇల్యూమినేషన్ బోర్డులను ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల పెద్ద బొమ్మలలో శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ కల్యాణం, అయోధ్య రాముడు, రామబాణం, ఏనుగు మీద శ్రీవారు, గరుత్మంతుడిపై శ్రీవారు, శ్రీ పద్మనాభ స్వామి, అమ్మవారి త్రీడీ రూపం, శ్రీరాముడు - శబరి, దశావతారాలు, అష్టలక్ష్ములు వంటి దివ్యరూపాలు విద్యుత్ కాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సౌందర్యాన్ని పంచనున్నాయి. అదేవిధంగా 20 వేల సీరియల్ లైట్స్, 10 వేల ఫ్లడ్ లైట్లు, 500 రంగు రంగుల లైట్లు, 40 జనరేటర్లు, వివిధ రకాల తోరణాలతో ఒంటిమిట్ట అంతా ప్రకాశవంతంగా మారి బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత పెంచనున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా కల్యాణ వేదిక**

ఏప్రిల్ 1న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. వారి సౌకర్యార్థం కల్యాణ వేదిక పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతం మరియు ఆలయ పరిసరాల్లో 24 ఎల్.ఈ.డి వీడియో డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా భక్తులు ఎక్కడి నుంచైనా శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని కనులారా వీక్షిస్తూ భక్తి పరవశంలో తేలియాడేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## తిరుపతి ఎస్.ఐ.హెచ్.ఎం సిబ్బంది వేతన కష్టాలకు తెర

(మొదటి పేజీ తరువాయి)

చొరవతో పరిష్కారం లభించింది. గత ప్రభుత్వ వైఖరితో 22 నెలలుగా పెండింగ్లో ఉన్న సుమారు రూ. 84 లక్షల వేతన బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేయడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని మంత్రి ఛాంబర్లో సిబ్బంది ప్రతినిధులు మంత్రి కందుల దుర్గేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**సిబ్బంది ఆవేదన -మంత్రి స్పందన:**

గత రెండేళ్లుగా జీతాలు అందక తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, ఈ విషయాన్ని గత నెలలో మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే స్పందించారని సిబ్బంది పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి త్వరితగతిన నిధులు విడుదలయ్యేలా కృషి చేసినందుకు మంత్రి కందుల దుర్గేష్ కి వారు ధన్యవాదాలు తెలిపారు.మంత్రి కందుల దుర్గేష్ ను కలిసిన వారిలో బోధనా సిబ్బంది తరపున లెక్చరర్ కె. శివరామకృష్ణ, లెక్చరర్ మరియు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్. భార్గవి, అలాగే నాన్-టీచింగ్ సిబ్బంది అకౌంట్స్ అసిస్టెంట్ సి. నరేష్, స్టోర్ అసిస్టెంట్ పి. జ్యోత్స్న దేవి తదితరులు ఉన్నారు. తమ కష్టాలను గుర్తించి అండగా నిలిచిన మంత్రి కందుల దుర్గేష్ కి, కూటమి ప్రభుత్వానికి, ప్రత్యేకించి సీఎం చంద్రబాబునాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాట లకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఈ సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేశారు.

## సచివాలయంలో అచ్చెన్న హ్యాపీ బర్త్ డే!

(మొదటి పేజీ తరువాయి)

అచ్చెన్న హ్యాపీ బర్త్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా కేక్ కట్ చేయించి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నారా లోకేష్ సమక్షంలో క్యాబినెట్ మంత్రులంతా కలిసి కేక్ కట్ చేసి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపిస్తూ ఆత్మీయ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అచ్చెన్నాయుడు చేసిన కృషిని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా ప్రజల అభ్యున్నతికై నిత్యం ఆలోచిస్తూ, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడి రాష్ట్ర పురోగతికి బాటలు వేసిన నాయకుడిగా ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలో తన జన్మదిన వేడుకలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తనపై ప్రత్యేక వాత్సల్యంతో స్వయంగా కేక్ కట్ చేయించి ఆశీర్వదించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన యువనేత నారా లోకేష్, మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి ఆత్మీయత, ఆశీస్సులు తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, రైతన్నల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 120 జిల్లాల్లో ప్రభుత్వ డ్రైవింగ్ స్కూళ్లు

- **కోటి ఉద్యోగాల కల్పన: గడ్కరీ**

**ఢిల్లీ, మార్చి 26:** దేశంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన 120 జిల్లాల్లో డ్రైవింగ్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. పరిశ్రమ వర్గాలతో కలిసి వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా రాబోయే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బాలీవుడ్ నటుడు ఆమిర్ఖాన్ నిర్వహించిన 'సడక్ సురక్షా అభియాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని గడ్కరీ అన్నారు. దీన్ని అధిగమించేందుకు ఇప్పటికే 200 డ్రైవింగ్ స్కూళ్లు తెరిచినట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కొత్తగా డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచంలో అత్యధికంగా భారత్లోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. ఏటా 5 లక్షల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందులో 1.8 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వీరిలో 66 శాతం మంది 18-44 మధ్య వయస్కులేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా భారత్ 3 శాతం జీడీపీని కోల్పోతోందని గడ్కరీ వెల్లడించారు.




## పవిత్ర హజ్ యాత్రకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి

**విజయవాడ, మనం బ్యూరో:**మైనారిటీ సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గురునానక్ కాలనీ లోని ప్రైడ్ మాధవ్ హోటల్ లో మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో హజ్ - 2026 యాత్ర సన్నద్ధతపై (కన్వర్జెన్స్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య కార్యదర్శి చిత్తూరి శ్రీధర్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా, హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్, అడిషనల్ డీసీపీ ఎన్వీఎమ్ మురళీ కృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్ మాట్లాడుతూ 2026 సంవత్సరానికి రాష్ట్రం నుంచి 2005 మంది హజ్ యాత్రికులు ప్రయాణించనున్నారన్నారు. ఏప్రిల్ 18,19 తేదీల్లో నిర్వహించే పవిత్ర హజ్ యాత్రకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 335 మంది యాత్రికులతోపాటు, హైద్రాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 1134, బెంగళూరు నుండి 515, చెన్నై నుండి 14, ముంబై నుండి 05, ఢిల్లీ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 02 మంది హజ్ యాత్రకు వెళ్లనున్నారన్నారు. హజ్-2026 యాత్రకు సంబంధించి మొత్తం 335 మంది యాత్రికులు ఎంపికయ్యారు. అందులో 169 మంది పురుషులు, 166 మంది మహిళలు ఉన్నారన్నారు. పవిత్ర హజ్-2026 యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర అధికారులందరూ సమిష్టి కృషితో పనిచేసి హజ్ యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పవిత్ర హజ్ యాత్ర, గౌరవప్రదమైన ప్రయాణాన్ని వారికి అందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న హజ్ యాత్రికుల సౌకర్యార్థం విజయవాడను ఎంబార్కేషన్ కేంద్రంగా గుర్తించారన్నారు. యాత్ర ఏర్పాట్లలో సమన్వయం కోసం రాష్ట్ర హజ్ కమిటీ, జిల్లా యంత్రాంగం, విమానాశ్రయ అధికారులు (ఎఎఐ), పోలీస్, వైద్య విభాగాలకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. గత అనుభవాలను ధృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది క్యాంపును గన్నవరం ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్ఎమ్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసే దిశగా పరిశీలిస్తున్నామన్నారు. ఈ వేదికలో ఏసీ సౌకర్యం, విశాలమైన పార్కింగ్, ప్రార్థనలకు అనువైన స్థలాలు అనువుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. యాత్రికుల కోసం సమగ్ర సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. క్యాంపులో సీటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

## ష్...గప్‌చుప్..!!!

### ముఖ్యమంత్రులతో నేటి సాయంత్రం వర్చువల్‌గా మాట్లాడనున్న మోడీ

**ఢిల్లీ, మార్చి 26:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ నేడు వర్చువల్గా సమావేశం కానున్నారు. సాయంత్రం 6.30కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ఆ సీఎంలు దూరంగా..**

వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్ లో చర్చల వివరాలను సీఎస్ లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఎయిర్ పొల్యూషన్‌కు చెక్.. కార్బన్ గార్డెన్

**ఢిల్లీ, మార్చి 26:** దేశవ్యాప్తంగా ఆయా నగరాలను వాయు కాలుష్యం వేధిస్తోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ యూనివర్సిటీ.. దీనికి తక్కువ ఖర్చుతో కూడిన ప్రభావవంతమైన పరిష్కారం చూపింది. అదే 'కార్బన్ గార్డెన్'. యూనివర్సిటీలోని వృక్షశాస్త్ర విభాగ అధిపతి దీనబంధు సాహూ ఆధ్వర్యంలో 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు.50 రకాల మొక్కలతోపాటు శైవలాలు, శిలీంధ్రాలు, బ్యాక్టీరియాలతో కూడిన ఈ గార్డెన్.. కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను గ్రహిస్తుంది. ఈ మొక్కలు, సూక్ష్మజీవులు.. విష వాయువులను విచ్ఛిన్నం చేయడంతోపాటు నేలను పునరుజ్జీవింపజేస్తాయని సాహు తెలిపారు. ఇదొక చిన్నపాటి జీవవైవిధ్య ఉద్యానవనంలా పనిచేస్తుందన్నారు. ఇటీవల వర్సిటీలో నిర్వహించిన ఓ జాతీయ సదస్సులో నిపుణులు ఈ నమూనాను ప్రశంసించారు. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నదని, అధిక జనసాంద్రత కలిగిన నగరాల్లో విస్తరించేందుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

## రంగంలోకి రష్యా?

**క్రెమ్లిన్, మార్చి 26:** అమెరికా-ఇజ్రాయెల్తో యుద్ధం చేస్తోన్న ఇరాన్ కు రష్యా నుంచి సహాయం అందుతున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి పుతిన్ ప్రభుత్వం దశలవారీగా డ్రోన్లను డెలివరీ చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నెలాఖరుకు ఆ రవాణా పూర్తికానుందని వెల్లడించాయి.
డ్రోన్లతో పాటు ఆహారం, ఔషధాలను కూడా పంపిస్తోందని రాసుకొచ్చాయి. 'ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను రష్యా తయారుచేస్తోంది. వాటిని ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగిస్తోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ షిప్మెంట్లు చేస్తోంది' అని పశ్చిమదేశాల నిఘా సమాచారాన్ని ఉటంకించాయి.

అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్‌కు రష్యా 'రియల్ టైమ్ ఇంటెలిజెన్స్' సహకారం అందిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ సమాచారాన్ని ఇరాన్కు రష్యా చేరవేస్తోందని వాటి సారాంశం.

ఇక తాజా కథనాలపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి స్పందించారు. 'ప్రస్తుతం చాలా నకిలీ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఒకటి మాత్రం వాస్తవం. ఇరాన్ నాయకత్వంతో మా సంప్రదింపులు కొనసాగిస్తున్నాం'' అని స్పష్టం చేశారు.

**ఇరాన్లోని రష్యా ఉద్యోగులు వెనక్కి..**

ఇరాన్లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నుంచి తన ఉద్యోగులను రష్యా వెనక్కి రప్పించింది. మంగళవారం ఈ ప్లాంట్ పై క్షిపణి పడిన నేపథ్యంలో 163 మంది సిబ్బందిని అక్కడినుంచి తరలించింది. ఈ ప్లాంట్ను నిర్మించింది రష్యానే.

మిగతా యూనిట్ల నిర్మాణం కోసం అక్కడ కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి అక్కడ కార్యకలాపాలను నిలిపివేయడం ఈ సందర్భంగా గమనార్హం.

## పారిశ్రామికవేత్తలుగా వడ్డెర్లు భరోసే మా లక్ష్యం

**అమరావతి,మార్చి,26,(మనం ప్రత్యేక ప్రతినిధి):** వడ్డెర్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారిని ఆర్థికంగా మేలు చేయడమే సీఎం చంద్రబాబు సంకల్పమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు.
దీనిలో భాగంగానే వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయింపుల్లో 15 శాతం మేర రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. సీనరేజీలో 50 శాతం మినహాయింపు ఇవ్వడానికి కూడా కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో గురువారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రిమండలి బిల్లు కూడా ఆమోదించిందని తెలిపారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చడంపై హర్షం వ్యక్తంచేశారు. మాటల నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహించారని, ఆ సమయంలో వడ్డెర సామాజిక వర్గీయులు ఆయన్ని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారన్నారు.
రాళ్లు కొట్టడం, మట్టి పనులు చేసుకోవడం తమ జీవనోపాధిని, ప్రభుత్వ ఆధీనంలోని కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ లీజులు కల్పిస్తే తాము గౌరవప్రదంగా జీవనం సాగిస్తామని మంత్రి లోకేశ్ కు అప్పట్లో వినతిపత్రం అందజేశారు. వడ్డెర సామాజిక వర్గీయులు వినతికి సానుకూలంగా స్పందించిన లోకేశ్, తాము అధికారంలోకి రాగానే తప్పకుండా న్యాయం చేస్తామని అప్పట్లో భరోసా ఇచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు.
ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో భేటీ అయిన మంత్రిమండలి సమావేశంలో మైనింగ్ లీజుల్లో వడ్డెర సొసైటీలకు 15 శాతం మేర రిజర్వేషన్లు కేటాయిస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు.
సీనరేజీలో కూడా 50 శాతం ఫీజు మినహాయించాలని ఆ బిల్లులో ఉందన్నారు. ఎన్నికల హామీని నెరవేర్చినందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. మైనింగ్ లీజుల్లో కేటాయింపులు, సినరేజీ మినహాయింపులపై కూటమి ప్రభుత్వం త్వరలోనే జీవో జారీచేయనుందని వెల్లడించారు.
త్వరలో ప్రారంభం కాబోయే ఆదరణ 3.0 పథకంలో వడ్డెర్లకు ప్రాధాన్యమివ్వనున్నామన్నారు. మైనింగ్ లో వినియోగించేలా వడ్డెర్లకు ఆధునిక మిషన్లు అందజేయాలని నిర్ణయించామన్నారు. వెనుకబడిన వడ్డెర్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. అందుకనుగుణంగా మైనింగ్ లీజుల కేటాయింపుల్లో వడ్డెర సొసైటీలకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

## శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



● మార్చి 27న ధ్వజారోహణం

ఒంటిమిట్ట / తిరుపతి,మార్చి 26, మనం న్యూస్ : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నిర్వహించనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు భక్తి భావపూర్వక వాతావరణంలో వేదమంత్రాల నడుమ గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. పురాతన చారిత్రక ప్రాశస్త్యాన్ని కలిగిన ఈ ఆలయంలో ఒకే శిలపై శ్రీ సీతారామ లక్ష్మణుల దివ్య మూర్తులు వెలసి ఉండటంతో ఒంటిమిట్టను ఏకశిలానగరంగా కూడా పిలుస్తారు. ఈ పవిత్రక్షేత్రంలో మార్చి 26 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో ముస్తాబైంది. గురువారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చనలను శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం 6 గంటల నుండి అర్చకుల వేదమంత్రాల నడుమ అంకురార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశ ప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ వంటి శాస్త్రోక్త కర్మలను నిర్వహించారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

**మార్చి 27న ధ్వజారోహణం**

శుక్రవారం ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. దీంతో శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు పోతన జయంతి కార్యక్రమం, కవి సమ్మేళనం జరుగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవను భక్తులు వీక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, ఏఈవో బాలరాజు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి మీ ఇంటికి - మీ డాక్టర్

● మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్




తిరుపతి, మార్చి 26, మనం న్యూస్: గ్రామీణ ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడానికి పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా మీ ఇంటికి మీ డాక్టర్ ప్రాజెక్టులో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రి ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన 'మీ ఇంటికి మీ డాక్టర్ ' ప్రాజెక్టులో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్ ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీహరి రావు, డిఎంహెచ్వో బాలకృష్ణ నాయక్ తో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ సంరక్షణ బలోపేతం చేసే దిశగా.. తిరుపతి జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సహకారంతో మీ ఇంటికి మీ డాక్టర్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ వైద్య వాహనం ను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈ వాహనం ప్రధానంగా అత్యంత వెనుకబడిన వర్గాలు అయిన ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాలకు చేరుకొని, రోజుకు సుమారు 100 మంది రోగులకు అవుట్ పేషెంట్ సేవలు మరియు అవసరమైన మందులను అందించే విధంగా రూపకల్పన చేయబడిందన్నారు. ఈ వాహనంలో ఒక డ్రైవర్తో పాటు ఇద్దరు ఫార్మసిస్టులు, ఒక స్టాఫ్ నర్స్, ఒక వైద్యుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతిరోజూ నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం రెండు నుంచి మూడు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించేందుకు ఈ బృందం పనిచేస్తుందని తెలిపారు. సుమారు రూ 8.40 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో మాత్రమే ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, అందులో తిరుపతి జిల్లా ను ఒకటిగా ఎంపిక కావడం విశేషమని తెలిపారు. ఈ కార్యక్రమం 100% రోగనిరోధక టీకాలు కవరేజ్ తో పాటు ప్రస్తుత మరణాలు రేటు చేయి డెంగ్యూ మలేరియా వంటి అంటువ్యాధుల భారాన్ని తగ్గించే దిశగా దృష్టి సారిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం అమలులో డాక్టర్ శ్రీహరి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. తిరుపతిలో ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి ఆధునిక బ్లడ్ బ్యాంక్ ను ప్రారంభించామని తెలిపారు. ఈ బ్లడ్ బ్యాంక్లో అన్ని రకాల రక్త గ్రూపులు అందుబాటులో ఉండటంతో పాటు, ప్లేట్లెట్లు, ప్లాస్మా వంటి భాగాలను వేరు చేసే ఆధునిక యంత్రాలు ఉన్నాయని అన్నారు. త్వరలో మొబైల్ బ్లడ్ బ్యాంకు కూడా ప్రారంభించి, కళాశాలలు మరియు ప్రధాన సంస్థలకు తీసుకెళ్లి రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ అవసరమైన రక్తాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తిరుపతి జిల్లాలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో, రక్తం సమయానికి అందించడం అత్యంత కీలకమని తెలియజేశారు. ప్రజల ఆరోగ్య సేవలను మెరుగుపర్చడా లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ఎంతో చురుకుగా పనిచేస్తున్నారని, ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మయూరి, కార్యదర్శి ప్రతీత్, సుబ్బారావు రుయా హాస్పిటల్ సూపర్డెంట్ రాధా, ఎస్ వి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ రవి ప్రభు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఖజానా ఆదాయం పెంచే లక్ష్యాలను అధిగమించాలి

● అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
● జీఎస్టీ వసూళ్లపై ప్రత్యేక దృష్టి
● జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి, మార్చి 26, మనం న్యూస్ : జిల్లా ఖజానాకు ఆదాయం పెంపు కోసం అన్ని ఆదాయార్జన శాఖలు సమన్వయంతో పని చేసి లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.గురువారం మదనపల్లి కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్, రవాణా, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శాఖల వారీగా ఆదాయ సాధన పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థత పెంపుతో పాటు ఆదాయ వృద్ధి సాధించడం లక్ష్యంగా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ పనుల్లో జీఎస్టీ వసూళ్లు తప్పనిసరిగా జరిగేలా చూడాలని, బిల్లులు ప్రాసెస్ చేసే సమయంలో జీఎస్టీ యాక్టివ్ స్థితిని పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో జరిగే పనులకు ఉపయోగించే ఇంధనాన్ని రాష్ట్రంలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అక్రమ మద్యం రవాణాపై కట్టుదిట్టమైన నిఘా...**

ఎక్సైజ్ శాఖపై సమీక్షిస్తూ, మద్యం దుకాణాలు, బార్లలో సీసీటీవీల పనితీరును పర్యవేక్షించి అవకతవకలు జరగకుండా చూడాలని చెప్పారు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని, దీనిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

**జీఎస్టీ రిజిస్ట్రేషన్పై అవగాహన కార్యక్రమాలు...**

మండల అభివృద్ధి అధికారులు, గ్రామపంచాయతీలకు జీఎస్టీ రిజిస్ట్రేష్న అవగాహన కల్పించి, అందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కెఆర్ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 'రెవెన్యూ వింగ్' ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి, రోజువారీ పురోగతిని సమీక్షించాలని సూచించారు. ప్రతి వారం బిల్లుల వివరాలను సేకరించి కమర్షియల్ టాక్స్ శాఖతో మరియు ఇతర శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు. మైన్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రవాణా, అటవీ తదితర శాఖలు తమ లావాదేవీలను క్రమబద్ధంగా నమోదు చేసి పన్నుల వసూళ్లను పెంచాలని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రెవెన్యూ వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయండి

● జిల్లా కలెక్టర్కు ఏపీడబ్ల్యుజేఎఫ్ వినతి



తిరుపతి, మార్చి 26,మనం న్యూస్: తిరుపతి జిల్లాలో జరిగిన అక్రిడిటేషన్ మొదటి జాబితాలో మంజూరు అయ్యి పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ను ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు గురువారం కోరారు.

కలెక్టర్ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తిరుపతి జిల్లా నూతన అధ్యక్షుడు జి.చెంగల్రాయులు(గాంధీ), ప్రధాన కార్యదర్శి వళిగళం గోపి, ఉపాధ్యక్షులు పానేటి చెంగల్రాయులు, సీనియర్ జర్నలిస్ట్ ఆలూరు గిరిధర్, కోశాధికారి శ్రీనివాస్, తిరుపతి నియోజకవర్గం అధ్యక్షుడు, బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి చామంచి కుమార్, కోశాధికారి మణి తదితరులు కలిశారు.

అక్రిడిటేషన్ మొదటి జాబితాలో పెండింగ్ అక్రిడిటేషన్ కార్డులతో పాటు రెండో జాబితా సమావేశం కూడా త్వరగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెండో జాబితా సమావేశం ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహిస్తామని, అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. సవరించిన ఎక్రిడేషన్ నిబంధనల వల్ల పలువురు పాత్రికేయులు అక్రిడిటేషన్ పొందలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో పూర్వపు నిబంధనల మేరకు పాత్రికేయులకు హెల్త్ కార్డులు ఇప్పించాలని అన్నపరెడ్డి కమిషనర్ కు విన్నవించారు. గతంలో డస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఉండేవి కాదని అయినా వారికి హెల్త్ కార్డులు మంజూరు చేసారని గుర్తు చేశారు. ఈ క్రమంలో కనీసం పూర్వపు అక్రిడిటేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు మంజూరు అయ్యేలా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. నిజానికి హెల్త్ కార్డుల విషయంలో అక్రిడిటేషన్ తప్పనిసరన్న నిబంధన లేదని ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. . అక్రిడిటేషన్ ఉన్న వారికి మాత్రమే ఆరోగ్య కార్డులు ఇవ్వాలన్న నిబంధన ఉన్నట్లయితే దానిని సవరించి అర్హులు అందిరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేయించే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.



## పంచామృతాలతో అభిషేకం

ముమ్మిడివరం మార్చి 26మనం న్యూస్ : సీతా రాములు కళ్యాణంలో భాగంగా సీతారాములు వారికి 108 కళాలతో గంగాజలంతో,పంచామృతాలతో,వివిధ రకాల పలరశాలతో సీతారామస్వామివారికి అభిషేక కార్యక్రమాలు గురువారం నిర్వహించడం జరిగింది. పొత్తూరి వీరవేంకట సుబ్బరాజు, దుర్గా భవానీ దంపతులచే మరియు గ్రామ ప్రజలు చే అభిషేక కార్యక్రమం నిర్వహించారు .తీర్థప్రసాదాలు అందజేశారు .విశ్వనాథ శాస్త్రి పర్యవేక్షణలో ఎం . సాయి శర్మ,కే . కిషోర్ శర్మ ఆధ్వర్యంలో సీతా రామ స్వామి వారికి అభిషేక కార్యక్రమం నిర్వహించారు అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు .శుక్రవారం ఉదయం 8.30 నిముషాలు కు సీతా రామస్వామి వారి దివ్య కల్యాణం మహోత్సవం ప్రారంభం అవుతుందని కొత్త లంక సొసైటీ మాజీ అధ్యక్షులు పి టి వర్మ తెలిపారు.



## ఆలయాలు ముస్తాబు

కాత్రేనికోన మార్చి 26 మనం ప్రతినిధి : శ్రీరామ నవమిని పురస్కరించుకుని రామాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు నేడు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఆలయాలను అలంకరిస్తున్నారు. ఆలయాలకు రంగులువేసి,విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.ఇప్పటికే ఆలయాలకు రంగులు,టెంట్లు,పెండ్లి పందిరి తదితర ఏర్పాట్లు చేశారు.కాత్రేనికోన మండల పరిధిలో కుండలేశ్వరం, చెయ్యేరు,కాత్రేనికోనకందికుప్ప,పల్లంకుర్రు గేద్దనపల్లి,నడవపల్లి కొప్పిగుంట,దొంతికుర్రు, పల్లం,తదితర ప్రాంతాల్లో ఆలయాలకు ముస్తాబు చేశారు.



## గొర్ల బాబ్జి కుటుంబానికి మురళి రాజు ఆర్థిక సాయం

ప్రత్తిపాడు,మార్చి 26(మనం న్యూస్) : మండలం ధర్మవరం గ్రామంలో గొర్ల బాబ్జి ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణించారు.తన భార్యను ఇద్దరు పిల్లలను,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి బాబ్జి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి పవిత్ర ఆత్మ శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించి ఆ నిరుపేద కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసి బాబ్జి ఇద్దరు పిల్లలకి భవిష్యత్తు కాలంలో ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,జువ్వల దొరబాబు,వార్డ్ నెంబర్ గదులు శివ,నానిపల్లి వెంకన్న,నానిపల్లి నాని,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






## జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న జగ్గంపేట సిఐ,ఎస్ఐ

జగ్గంపేట మార్చి 26( మనం న్యూస్) : కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా క్రైమ్ సమీక్ష సమావేశం - నేర నియంత్రణపై ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఎస్పీ చేతుల మీదుగా జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావు,జగ్గంపేట ఎస్సై టీ రఘునాథరావుకు ఎస్పీ ప్రశంస పత్రాలు అందుకున్నారు.ఇటీవల కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మన్యం వారి పాలెం గ్రామంలో 80 సంవత్సరాల వృద్ధుడు గెడ్డం కన్నయ్య అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు,ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులకు ఎటువంటి ఆధారాలు లభించకపోయిన జగ్గంపేట సిఐ తిరుపతిరావు,ఎస్ఐ రఘునాథరావు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, ప్రత్యేక శ్రద్ధతో కేసును చేదించి,ముద్దాయిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు.ఈ యొక్క హత్య కేసును జగ్గంపేట పోలీసులు చాకచక్యంగా చేదించడంతో ఎస్పీ అభినందించడం జరిగిందన్నారు.



## శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుపతి(టిటిడి)/హైదరాబాద్, మార్చి 26,మనం న్యూస్ : ది చెన్నై షాపింగ్ మాల్ అధినేత మర్రి వెంకటరెడ్డి మర్రి రిటైల్ లిమిటెడ్ సంస్థ పేరిట టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు గురువారం రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

## టీటీడీకి రూ.60 లక్షలు విరాళం



తిరుమల, మార్చి 26,మనం న్యూస్ : టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు పలువురు దాతలు రూ.60 లక్షలు విరాళంగా అందించారు. వీరిలో చెన్నైకు చెందిన శ్రీమతి రేవతి విశ్వనాథ్ రూ.40 లక్షలు విరాళంగా అందించారు.హైదరాబాద్ కు చెందిన వి. శ్రీ భవేశ్ చౌదరి రూ.10,07,777 విరాళంగా అందించారు. అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పొనకల నాగేంద్ర రావు రూ.10 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు సదరు దాతలు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

## కొమ్ములెక్కుపెట్టిన దుప్పి

ఆధిపత్యం కోసంమో
ఆయుధ వ్యాపారం కోసమో
వాడు వదిలిన
లోహ విహంగాల సాక్షిగా
పచ్చగా గుబాళిస్తున్న
ప్రార్థనా మందిరాలు
అక్షరాల జ్ఞాననిలయాలు
సామాన్యుల జీవన లోగిళ్లు
శిథిలాల మధ్య చిక్కుకుని
నెత్తురోడుతూ దుఃఖిస్తుంటాయి
గెలిచేదెవడో ఓడేదెవడో
తేల్చేసే అంచనాలు పూర్తవకముందే
ప్రజలే ఓడిపోయి
యుద్ధ శకలాలమధ్య
క్షతగాత్రులుగా మిగిలిపోతారు
చేజారిన భోగోళమంత స్వప్నం
భళ్లున బద్ధలై
అద్దం పెక్కులు గుచ్చుకున్న
దేశ దేహమొకటి
నీలి ఆకాశం కింద తప్పిపోయిన
నెత్తుటి చారల పావురమై
నేలకొరిగి వుంటుంది
కొమ్ములు ఎక్కుపెట్టి
తెల్ల చారల పులిపైకి
లంఘిస్తున్న దుప్పి ఒకటి
ప్రపంచం మద్దతు కూడగడుతూ
ధిక్కార గీతాన్ని రచిస్తుంది

**- చిత్తలూరి**
9133832246

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**
**– ఎడిటర్**

# భద్రాద్రి రామయ్య కళ్యాణం..కమనీయం



అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి... అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్‌గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనక దుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచేవారు. 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్థం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్‌లో వేములవాడ, భద్రాచలం తెలంగాణలోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా భద్రాచలం మండలంలోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం పేర్లతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది.

పూర్వం భద్రుడు అనుభక్తుడు శ్రీ రాముడికోసం తపస్సుచేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరంపొందాడని అంటారు.ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్ర + అచలం) అని పేరు స్థిరపడింది.

గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచలప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పనిచేసే వాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వానికి జమ చెయ్యకుండా..1645 - 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశమందు రామాలయాన్ని నిర్మించాడు. సీతారామచంద్ర స్వాములకు రకరకాల నగలు..చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా..ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగించిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్లగోపన్న రామదాసుగా స్థిరపడ్డాడు.


దేవాలయమందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామచంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువుతీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానంలోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్సవానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్సవానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామదాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శనశాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు.

భారతీయ కాలమాన ప్రకారం రాముడు జన్మించినది వైవస్వత మన్వంతరమున పంచమ త్రేతాయుగ నాలుగవ భాగ మున ఎనభై వేల సంవత్సరానికి సరియగు విళంబి సంవత్సర చైత్ర శుద్ధ నవమి బుధవారం అని శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకట సుందరాచార్య స్వామి వచించారు. పురాణాల ఆధారంగా మహాభారత యుద్ధం నాటికి శ్రీరాముడు అతి ప్రాచీనుడు. మను చక్రవర్తి వంశావళిలో రాముడు 65వ పురుషుడని, ఆయన వంశస్తుడు శ్రీకృష్ణునికి సమకాలికుడైన బృహద్బలుడు మను వంశమున 94వ వాడని సుప్రసిద్ధ పాశ్చాత్య చారిత్రిక పరిశోధకుడు పరిటేరు నిర్ణయించాడు. వాల్మీకి రామాయణముననుసరించి రాముని జననకాలం క్రీ.పూ.2055వ సంవత్సరంగా ఎల్.డి. స్వామికన్ను పిళ్ళై నిర్ధారించగా, ఎం.ఆర్. సంపత్కుమార సమర్థించారు. పాశ్చాత్య చరిత్రకారులైన డబ్ల్యు.డబ్ల్యు.హంటర్, కానింగ్ ఆర్నాల్ వంటి వారు, రామాయణ చరిత్ర క్రీ.పూ.1000 సంవత్సరాల ప్రాంత మని పేర్కొన్నారు. మహా విష్ణువు ఎత్తిన 10 అవతారాలలో ఏడవది రామావ తారం. శ్రీరాముడు కోసలాధీశుడైన దశరథునికి, కౌసల్యా గర్భమున చైత్ర శుద్ధ నవమి పునర్వసు 4వ పాదమున కర్కాటక లగ్నంలో మధ్యాహ్న సమయాన జన్మించాడు. అందుకే చైత్ర శుద్ధ నవమి శ్రీరామ జయంతి దినమైంది. రాముడు పుట్టినది నవమికాగా, అంతకు ముందు అనగా రాముడు గర్భంలో ఉన్న చివరి తొమ్మిది దినాలు చేసే మత విధులు, పూజాదికాలు గర్భ నవరాత్రులుగా ఆరాధనీయం. ఆగస్త్య సంహితలో అష్టమి గురుపూజ, నవమి ప్రతిమా కల్పన, దశమి ప్రతిమా దానంగా మూడునాళ్ళ పండగగా చెప్పబడింది. నవమి ఉపవాసం, రాత్రి పురాణ శ్రవణం, జాగరణ, మరునాడు సంతర్పణ ఉంది. పునర్వసు నక్షత్ర యుక్త నవమి పుణ్యకాలమని భావిస్తారు. అష్టమితో కూడిన నవమిని రామపూజ కూడదని విష్ణుభక్తులకు అగస్త్య సంహిత సూచిస్తున్నది. అందుకే మిగులు నవమి నాడు వైష్ణవులు రామ జయంతిని జరపడం పాటిస్తారు. శ్రీరామ నవమి నాటి కార్యకలాపాలు మధ్యాహ్నం 12గంటలకు చేయాలని వ్రత గ్రంథాలు సూచిస్తున్నాయి. రామ జననం, కల్యాణం జరిపే రామ నవమి కాకుండా రామ సంబంధ పండగలలో ఒకటి రామలక్ష్మణ ద్వాదశిగా జరుపుకునే జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి, రెండవది జానకీ జయం తిగా జరుపుకునే ఫాల్గుణ శుద్ధ అష్టమి. జనకునికి యజ్ఞ శాలకై భూమిని దున్నతుండగా నాగటి చాలుకు తగిలిన బంగారు పెట్టెలో భూజాత దొరికినది ఫాల్గుణ శుక్ల అష్ట మిగా భావిస్తారు. శ్రీకృష్ణునిలా కాక, రాముని జన్మదినోత్సవం కన్నా కళ్యాణోత్సవానికి విశిష్టత ఉంది. రామ జన్మకు కారణమైన రావణవధ ద్వారా లోకకళ్యాణం. సీతాదే వితో కూడిన రాముని వల్లే లోక కళ్యాణం సాధ్యమైంది. రాముని ఆంధ్రుల దౌహిత్రునిగా భావిస్తారు. కోసలాదేశ రాజు కూతురు కౌసల్య. దక్షిణ కోసల అంటే పూర్వాంధ్ర దేశ ఉత్తర భాగం. కౌసల్య ఆంధ్రుల ఆడపడచు అనీ, వనవాసాన్ని రాముడు తల్లి పుట్టింటి దేశపుటడవులలో గడిపారని వాదం ఉంది. వనవాస రాఘవునికి ఆతిథ్యమిచ్చిన తెలుగు నేలపై ఆయన జన్మదినమైన శ్రీరామనవమి, కళ్యాణ దినంగా ఘనంగా జరుపుకోవడం సనాతన సాంప్రదాయంగా వస్తున్నది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# భారత్ తన స్వతంత్రతను కోల్పోతున్నదా?





ఇప్పుడు ప్రపంచం మళ్లీ ఒక పెద్ద సంక్షోభ దశలో నిలిచింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు కేవలం ఆ ప్రాంతానికే కాకుండా, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి. భారత్ వంటి పెద్ద దేశంపై కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్లో స్వయంగా పరిస్థితులు బాగాలేవని, చాలా ఆందోళనకరంగా ఉన్నాయని చెప్పారు.గ్యాస్, ఇంధనం సరఫరాలో ఏ సమస్యాలేదని కూడా చెప్పారు. కానీ పరిస్థితులు మాత్రం చాలా ఘోరంగా ఉన్నాయి.

ప్రజల జీవితాలు దుర్భరంగా తయారవుతున్నాయి. గ్యాస్ సిలిండర్లు దొరకడం కష్టంగా ఉంది. బ్లాక్ మార్కెటింగ్ పెరిగిపోయింది. చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు బాగా ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు ఇన్డక్షన్ (విద్యుత్)స్టవ్లను కొనుగోలు చేస్తున్నారు. కానీ వాటి ధరలు కూడా పెరిగాయి. కొనగలిగే స్థోమత లేని వారు అర్థాకలితో జీవించడానికి లేదా ఇతరుల సహాయంపై ఆధారపడటానికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం కరోనా రోజులు గుర్తుకొస్తున్నాయి, ఆ సమయంలో ప్రజా జీవనం దుర్భరమైపోయింది. ఆక్సిజన్, మందులు కూడా బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

ప్రధాన మంత్రి మోదీ ఈ పరిస్థితులపై పార్లమెంట్లో మాట్లాడారు. కానీ ఇరాన్‌పై దాడులపై స్పష్టమైన వైఖరిని ప్రకటించలేదు. ఇది చాలా ఆశ్చర్యకర విషయం, ఎందుకంటే భారత్ ఒకప్పుడు తన నిస్పక్షపాత, న్యాయబద్ధ విధానాలతో ప్రపంచంలో ప్రసిద్ధి చెందింది. మరిప్పుడు భారత్ వైఖరిలో ఈ మార్పు ఎందుకు వచ్చిందో తెలియదు.

2003లో, అమెరికా ఇరాన్‌పై అణ్వాయుధాలు ఉన్నాయన్న ఆరోపణలతో దాడి చేసినప్పుడు, అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఆ చర్యను తీవ్రంగా ఖండించారు. పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించి, అమెరికా దుర్మార్గాన్ని ఎండగట్టారు. అమెరికా అహంకార చర్యలు ప్రపంచానికి ప్రమాదకరమని ప్రకటించారు. అన్యాయంగా ఎవరు ఎవరిపై యుద్ధం ప్రకటించినా తాము వ్యతిరేకిస్తామని భారత్ అప్పుడు స్పష్టంగా చెప్పింది. ఇప్పుడు భారత్ ఆ ధైర్యం, ఆ ఆత్మవిశ్వాసం ఎందుకు కోల్పోతుందో అర్థంకాదు. మోదీ పాలనలో భారత్ అమెరికా,ఇజ్రాయిల్తో సంబంధాలను గణనీయంగా పెరిగినమాట వాస్తవం. రక్షణ, సైనిక ఒప్పందాలు, సాంకేతిక ఒప్పందాలు ఇవన్నీ అవసరమే, కానీ ఈ సంబంధాల కారణంగా భారత్ తన స్వతంత్రతను తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు.

ఇరాన్‌పై ఇటీవల జరిగిన దాడులు అంతర్జాతీయ చట్టాల స్పష్టమైన ఉల్లంఘన. చాలా దేశాలు యుద్ధం పట్ల ఆందోళన వ్యక్తం చేశాయి. కొందరు తీవ్ర పదజాలంతో ఖండిస్తే, మరికొందరు సార్వభౌమత్వంపై దాడిగా అభివర్ణించారు. కానీ భారత్ ఎలాంటి నిర్దిష్టమైన ఖండన, శక్తివంతమైన విదేశాంగ చర్యలు తీసుకోలేదు. 'నిష్పక్షపాత విధానం'లో కేంద్ర స్థానంలో ఉన్న భారత్ స్థాయికి ఇది ఏమాత్రం శోభించే లక్షణం కాదు. భారతదేశం ఎనర్జీ పాలసీలో పరిమితులు ఎదుర్కొంటోంది. దేశం ఇంకా అన్ని రకాల ఎనర్జీ అవసరాలకు స్వయం సమర్థత పొందలేదు. క్రూడ్ ఆయిల్, గ్యాస్ వంటి వనరుల కోసం పెద్దమేరకు బయటి దేశాలపై ఆధారపడుతోంది.

దేశీయ పరిస్థితులు కూడా ఆందోళనకరంగా ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లు, బ్లాక్ మార్కెటింగ్, పెట్రోలు కోసం పొడవైన క్యూలైన్లు ప్రజల జీవితాలను కష్టతరం చేస్తున్నాయి. ఎలాంటి క్రైసిస్ లేదని ప్రభుత్వం చెబుతోంది కానీ సమస్య ఉన్నమాట నిజం. ప్రజలు దాన్ని అనుభవిస్తున్నారు. భారత్ తన అవసరాల్లో పెద్ద భాగాన్ని గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఈ సరఫరా మార్గాలు హోర్ముజ్ జలసంధి మీద ఆధారపడి ఉన్నాయి. ఒక చిన్న అవరోధం కూడా మొత్తం వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. ప్రభుత్వం అంతర్జాతీయ సమస్యలపై స్పష్టమైన స్పందన కలిగి లేదు.

ఇది ప్రజల నమ్మకాన్ని ప్రభావితం చేస్తుంది. ధరలు పెరుగుతున్నాయి, నిరుద్యోగత, ప్రాథమిక వసతుల లోపం ప్రజలను కష్టంలో పడేసింది. ఇలాంటి సందర్భంలో, విదేశీ విధానం స్పష్టంగా లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచు తుంది.

భారత్ విధానాలు కేవలం స్వార్థాల చుట్టూ తిరుగుతున్నాయి. గతంలో భారత్ న్యాయానికి, స్వతంత్రతకు ప్రాధాన్యం ఇచ్చేది. ఇప్పుడు ఆ సూత్రాలు మరుగున పడ్డాయి. చిన్న దేశంపై దాడి జరిగితే మౌనం వహించడం, నామమాత్రంగా స్పందించడం, పెద్ద దేశాలకు వంత పాడడం, బలవంతులతో సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వడం, దీర్ఘకాలంలో ఇది దేశ ప్రతిష్టకు హానిగా పరిణమించవచ్చు.

సాధారణంగా పాకిస్థాన్ బలహీన దేశం, భారత్‌తో దానికి పోలికే లేదు. కాని ఇప్పుడది ఇరాన్-అమెరికాల మధ్య మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఆసిం మునీర్ , ప్రధాని షెహబాజ్ షరీఫ్ లు ఇతర దేశాలతో సమన్వయం చేస్తున్నారు. కానీ భారత్ కేవలం ఆత్మరక్షణ ప్రకటనలకే పరిమితమైంది. ఇదే సమయంలో, ప్రపంచ దేశల ద్వంద్వ విధానాన్ని కూడా గమనించాలి. ఒక బలమైన పశ్చిమ దేశానికి ముప్పు ఏర్పడితే న్యాయం గుర్తుకొస్తుంది. మానవహక్కుల గురించి గొంతు చించుకొని మాట్లాడతారు. కానీ పెద్ద దేశాలు అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించి చిన్న దేశాలపై, బలహీన దేశాలపై దాడులకు పాల్పడితే మౌనం వహిస్తారు. ఇలాంటి పరిస్థితిలో, భారత్ తన సూత్రప్రాయ విధానమేమిటో స్పష్టంగా ప్రకటించాలి.

మొత్తానికి భారత్ ఒక చారిత్రక మలుపులో ఉంది. దాని ముందు రెండు మార్గాలున్నాయి.

ఒకటి : శక్తివంతుల ఒత్తిడిలోకిలోనై తన స్వతంత్రత తగ్గించుకోవడం, న్యాయ సూత్రాలను వదిలివేయడం.

రెండవది: న్యాయం, ధర్మం, నైతిక విలువల నాయకత్వం కాపాడుకుంటూ, ఒక నిజమైన గ్లోబల్ లీడర్‌గా ఎదగడం. ఏ మార్గాన్ని ఎంచుకోవాలో నిర్ణయం ప్రభుత్వం చేతిలో ఉంది. ఇలాంటి సంక్లిష్ట సమయంలో తీసుకునే నిర్ణయమే భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థను సుస్థిర పరచి ప్రజల విశ్వాసాన్ని పటిష్ఠం చేస్తుంది. కనుక భారత్ ఈ సంక్లిష్ట సమయంలో చారిత్రక బాధ్యతతో, ధైర్యంగా, సూత్రప్రాయ నిర్ణయాలు తీసుకోవాలి. సమస్యాత్మక సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోగలిగే ధైర్యవంతమైన దేశాలు మాత్రమే ముందుకు వెళ్ళగలవు.

**- యండి. ఉస్మాన్ ఖాన్**

## అక్షరాంక్షలు

రవి గాంచిన చోటే రాజుకు భీతిల్లి
నేడు కవి నక్కిన చోట
నిర్భయ కవితా దినోత్సవమా?!
పీడిత పక్షాన నిలవాల్సిన పంక్తులు
ప్రభువు మెడలో గజమాలలవుతున్న పూట
నిస్సిగ్గుగా కవి సమ్మేళనమా?!
బాధిత స్వరం అవ్వాల్సిన సిరా
రాజ్య పక్షాన బధిర నాదం అందుకుంటున్న వేళ
నిష్పక్షపాత కవితా గానమా?!
ఏరా
ఎల్లలు లేని కవిత్వానికి
ఇప్పుడు ఆంక్షల గోడలు కట్టారు కదరా !
మరి నా ఈ కవితను
సామాజికోద్దరణకు
నేను ఏ 'శీర్షిక' తో ముస్తాబు చేయను ?
ముద్రించాల్సిన వాడే చించేస్తుంటే
ఇంకే 'చిరునామాకు' రాసి పంపించను ?!

**- తిప్పాన హరిరెడ్డి**
9493832412

## చదువు

మేధకు మేత
చదువు మార్చు రాత
పెట్టకు కోత

జ్ఞానపు దారి
చీకటి చీల్చు సూరి
చదువేమరి

నైపుణ్య జ్ఞానం
భుక్తి భక్తి జీవనం
రక్షా కవచం
వెల్గుల తావు
అందరికి చదువు
నేతల పూచీ

**- రేడియమ్**
9291527757

# అమెరికా షరతుల అంతరార్థం ఏమిటి?






ఏక ధ్రువ ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యంగా అవతరించిన అమెరికా దేశానికి అధ్యక్షుడైన వ్యక్తి ఎవరైనా తననుతాను ప్రపంచఅధినేతగా భావించుకుంటుంటాడు.ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విషయానికి వస్తే ఆయన అది నిజమేనని నమ్ముతుంటాడు. ప్రపంచమంతా తన మాటలను శిరసావహించాలని కోరుకుంటాడు. ఆ దిశగానే పావులు కదుపుతుంటాడు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం విషయంలో ఆయన ప్రకటించిన పదిహేను షరతులను చూసినప్పుడు మనకు ఇదే విషయం స్పష్టమ వుతుంది. ఒక ప్రకటన విడుదల చేసి-దాని పైన చేసిన సంతకపు తడి ఆరక ముందే దానికి విరుద్ధమైన ఇంకో ప్రకటనను వెలువరిస్తున్నాడు. యుద్ధపరిభాషలో చెప్పాలంటే మాటను మడతపెట్టి ఒక మిస్సైల్ గా వదిలి - ఆ వెనువెంటనే,దాని వెనుక నుంచి ఇంకొక మిస్సైల్ వేసి మొదటి దానిని కూల్చడం డోనాల్ ట్రంప్ ప్రత్యేకత. అమెరికాలోగానీ, ప్రపంచంలోని ఏ ఇతర దేశాలలో గానీ ఇలాంటి ప్రకటనలు చేసిన వ్యక్తులు ఉన్నారో లేదో - చరిత్రలో కాస్త వెనుకకు వెళ్లి పరిశోధించాల్సి ఉంటుంది. ఇప్పటివరకయితే ఇతనిదే రికార్డ్.

ఒక దేశ ప్రతినిధులను చర్చల టేబుల్ ముందు కూర్చోబెట్టి అటువైపు నుంచి ఆ దేశపు నాయకులపై బాంబులు వేసి తుదముట్టించిన ఘనత కూడా బహుశా ఈయనకే దక్కుతుంది. అలాంటి ఘనత వహించిన వ్యక్తి మరిన్ని ఘనతలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నాడు అందులో భాగంగానే ఇరాన్ యుద్ధాన్ని ముగించి 48 గంటల్లో లొంగిపోవాలని ఆదేశం జారీ చేశాడు. కానీ ఆ గడువు పూర్తికాక ముందే యుద్ధానికి ఐదు రోజుల విరామాన్ని ప్రకటించాడు. ఆ గడువు కూడా పూర్తిగాకముందే మరో కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. యుద్ధ విరమణకు 15 అంశాలతో కూడిన షరతులను విధించాడు.

అందులో హోర్ముజ్ జలసంధిని నిరంతరం తెరచిఉంచడం, అణ్వాయుధ కార్యక్రమాన్ని శాశ్వతంగా వదులుకోవడం, అణుశుద్ధిని నిలిపివేయడం, ఇప్పటికే శుద్ధి చేసిన యురేనియం నిలువలను అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అప్పగించడం, పశ్చిమాసియా దేశాలలోని మిలీషియా కార్యకలాపాలను ఆపివేయడం, వివిధ సాయుధ గ్రూపులకు మద్దతు నిలిపివేయడం, బాలిస్టిక్ క్షిపణుల సంఖ్య, సామర్థ్యంపై నియంత్రణ- స్వీయ రక్షణకే క్షిపణుల వినియోగం ఇలాంటి ముఖ్యమైన షరతులకు ఒప్పుకుంటే ఇరాన్ పై ఉన్న అన్ని రకాల ఆంక్షలను ఎత్తివేస్తానని ఆయన ప్రకటించారు. ఇటు షరతులను విధించిన నోటి తోటే ఇంకొక వైపు తాము యుద్ధాన్ని గెలిచామని హోర్ముజ్‌పై ఇరాన్ తమకు పెద్ద బహుమతిని ఇచ్చిందని చెప్పుకున్నాడు. ఇరాన్ లోని గౌరవనీయమైన వ్యక్తులతో చర్చలు జరుగుతున్నాయని ఆ దేశం ఇప్పటికే చాలా ముఖ్యమైన షరతులను అంగీకరించిందని కూడా చెప్పుకొచ్చాడు. యుద్ధం ముగిసిపోయి, తాము విధించిన షరతులలో ఎదుటి పక్షం అతి ముఖ్యమైన వాటిని అంగీకరించిన తరువాత మళ్లీ ఈ కొత్త షరతులు ఏమిటి అని ఆయనను ఎవరూ నిలదీయడం లేదు. అయినప్పటికీ యుద్ధ విరమణ కోసం పాకిస్తాన్, ఈజిప్టు లాంటి దేశాలు ఇరుపక్షాలతో మధ్యవర్తిత్వం నెరపుతున్నాయని వార్తలందుతున్నాయి. ఇరుపక్షాలకు నచ్చ చెప్పే విషయంలో ఈ దేశాల నాయకులు తలమునకలైనట్లు, ఒకరి షరతులను ఇంకొకరికి చేరవేస్తున్నట్లుగా తెలుస్తున్నది. ఇరాన్ కూడా తమ యొక్క డిమాండ్లను మధ్యవర్తుల ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తమ దేశంపై జరుగుతున్న దాడులను పూర్తిస్థాయిలో నిలిపివేయడం, రానున్న రోజులలో తమపై ఎలాంటి దాడులు జరగవని హామీ ఇవ్వాలని, అకారణంగా తమపై దాడి చేసి ఇంతటి విధ్వంసానికి కారణమైనందుకు తమ దేశానికి నష్టపరిహారం చెల్లించాలని, తమ క్షిపణి కార్యక్రమానికి ఎలాంటి నియంత్రణా పనిచేయదని, హోర్ముజ్ జలసంధి పై తమ ఆధిపత్యాన్ని అధికారింగా గుర్తించాలని, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా స్థానాలని పూర్తిగా ఎత్తివేయాలనీ, లెబనాన్ లోని హిజ్బుల్లా మిలీషియాపై ఇజ్రాయిల్ దాడులను నిలిపివేయడం లాంటి ముఖ్యమైన డిమాండ్లను వారి ముందు ఉంచినట్లు తెలుస్తున్నది. ఒకవేళ మధ్యవర్తులు ఇరుపక్షాలనూ ఒప్పించి చర్చల టేబుల్ వద్దకు తీసుకు రాగలిగినా పై డిమాండ్లను చూసినప్పుడు అవి ఏ మేరకు ఫలిస్తాయనే విషయంలో అందరికీ సందేహాలు ఉన్నాయి. ఎందుకంటే చర్చల విషయంలో అమెరికా అనుసరించే విధానం అలా ఉంటుంది. ప్రస్తుతం ట్రంప్ ప్రతిపాదించిన చాలా అంశాలు గతంలో ఒబామాతో జరిగిన ఒప్పందానికి సంబంధించినవే ఉన్నవి. డోనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దుచేసి ఇరాన్‌ను మళ్ళీ ఆంక్షల చట్రంలో బిగించడం వల్లనే ఈ సమస్య ఇంతదాకా వచ్చింది. డోనాల్డ్ ట్రంప్ 48 గంటల విరామం ప్రకటించిన కాలంలోనే ఇజ్రాయిల్ ఇరాన్‌కు చెందిన పలు నగరాలపై భీకర దాడులు కొనసాగించింది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ నావికాదళ విభాగం అధిపతి అలీరెజా తంగసిరిని చంపివేసినట్లు గురువారం రోజు ప్రకటించింది. దీనిని బట్టి అర్థమవుతున్నది ఏమిటి అంటే యుద్ధాన్ని ఆపేదెవరో.. కొనసాగించేది ఎవరో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది.

దీనికి ప్రతిగా ఎన్ని నగరాలు ధ్వంసం అయినా, ఎంతమంది ముఖ్య నాయకులు అసువులు బాసినా ఇరాన్ వెనుకడుగు వేసేటట్లు కనిపించడం లేదు. అకారణంగా తమపైకి యుద్ధానికి దిగిన శత్రువుల అంతు చూసేదాకా వదలమని ఆదేశ నాయకులు ప్రకటిస్తున్నారు. ఓటమిని ఒప్పందంగా చెప్పుకోవద్దని వాళ్లు హెచ్చరిస్తున్నారు శత్రువు పశ్చాత్తాప పడేదాకా యుద్ధం ఆపేది లేదని తెగేసి చెబుతున్నారు. ట్రంపు విధించిన పదిహేను షరతులను ఆసాంతం పరిశీలిస్తే అర్థమయ్యేది ఏమిటంటే ఇరాన్‌ను అమెరికా ఇజ్రాయిల్ దేశాలకు కట్టు బానిసగా చేసే పదహారవషరతు దానిలో అంతర్లీనంగా దాగి ఉన్నట్టు కనిపిస్తుంది. ఇరాన్ వాటిని ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించేటట్టుగా కనిపించడం లేదు. కాబట్టి పశ్చిమాసియాలో యుద్ధం మరికొంత కాలం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. అది ఎటు నుంచి ఎటువైపు వెళ్ళి ఏ రూపం తీసుకుంటుందో కాలమే తేల్చాలి.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# మార గర్భధారణ నివారణపై అవగాహన
## బాలికల భవిష్యత్తు రక్షణకు చర్యలు



**విశాఖపట్నం, మార్చి 26, 2026:** జిల్లా మహిళా శిశు సంక్షేమ మరియు సాధికారత శాఖ, విశాఖపట్నం ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్ లైన్ 1098, సఖి వన్ స్టాప్ సెంటర్ సంయుక్తంగా నగరంలోని ఏఎస్ రాజా మహిళా కళాశాలలో విద్యార్థినుల కోసం కౌమార గర్భధారణ నివారిద్దాం - బాలికల భవిష్యత్తును కాపాడదాం అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి కే. హరికృష్ణ మాట్లాడుతూ, బాలికల రక్షణే నవ సమాజ స్థాపనకు పునాది అని పేర్కొన్నారు. విద్యార్థినులు సమాజంలో చైతన్యవంతులుగా మారి బాలికల హక్కుల పరిరక్షణలో ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. బాలికల భద్రత, ఆరోగ్య హక్కుల ప్రాముఖ్యతను వివరించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఇన్స్టిట్యూషనల్ కేర్) డి. చంద్రశేఖర్ మరియు వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ జి. శరణ్య మాట్లాడుతూ- బాల్య వివాహాల నిరోధంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలను వివరిస్తూ, ఇటువంటి ఘటనలను అడ్డుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. కౌమార దశలో శారీరక మార్పులు, లైంగిక ఆరోగ్యం, గర్భధారణపై సరైన అవగాహన కలిగి ఉండటం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రతి బాలిక ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు ప్రభుత్వ వృత్తి విద్యా అవకాశాలను వినియోగించుకొని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. గ్రామ స్థాయిలో బాల పంచాయతీలు, గ్రామ సభల్లో బాలికల సమస్యలపై చర్చలు జరిపి సామాజిక మార్పుకు దోహదపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. కాసు, ఎన్సీసీ కోఆర్డినేటర్ మాధురి, చైల్ లైన్ ప్రతినిధులు, అధ్యాపక బృందం మరియు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఎయిర్ బీఎన్బీ ఆతిథ్యంలో విజయ్ దేవరకొండ రష్మిక మందన్న



**విజయవాడ:** ప్రముఖ ఆన్లైన్ ట్రావెల్ బుకింగ్ సంస్థ ఎయిర్ బీఎన్బీ ఆధ్వర్యంలో ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కి వారి వివాహం తర్వాత ఎంపిక చేసుకున్న విహారయాత్రలో భాగంగా ఆతిథ్యం ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. కో స్యామ్యూయ్ గెట్వే లోపల తన తాజా ప్రచారంలో ఎయిర్ బీఎన్బీ విజయ్ దేవరకొండ మరియు రష్మిక మందన్న కలిసి ప్రయాణించడానికి మరింత వ్యక్తిగత మార్గాన్ని అందజేస్తుందన్నారు. వారి వివాహం తర్వాత వారి మొదటి విహారయాత్ర గురించి ఒక సంగ్రహావలోకనం అందిస్తోందని, వేగాన్ని తగ్గించడం, కలిసి సమయాన్ని గడపడం మరియు వారికి సన్నిహిత వ్యక్తులతో జరుపుకోవడం ద్వారా నిర్వచించబడిందన్నారు. కోహ్ స్యామ్యూయ్లో సెట్ చేయబడిన ఈ చిత్రం, ఈ జంట ఒక ప్రైవేట్ ఎయిర్ బీఎన్బీ విల్లాను ఎంచుకున్నప్పుడు, వారు వేగాన్ని తగ్గించడానికి మరియు సరళంగా ఉండటానికి అనుమతించే స్థలాన్ని రూపొందించింది అన్నారు. ప్రయాణం ఎప్పుడూ స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో కొత్త జ్ఞాపకాలు మరియు ఎయిర్బిఎన్బిలో ఉండడం చాలా సులభం అని చెప్పారు.ఓషన్ ఫ్రంట్ విల్లా, దాని విస్తారమైన భాగస్వామ్య ప్రదేశాలు, ఇన్ఫినిటీ పూల్ మరియు, లైవ్ ఇన్ డిజైన్తో, అనుభవానికి కేంద్రంగా మారిందని, విలాసవంతమైన తప్పించుకునే అనుభూతితో ఇంటి సౌకర్యాన్ని కలిపిస్తుందన్నారు. ట్రిప్ అంతటా స్నేహితుల ఉనికి ఈ రోజు ప్రజలు ఎలా ప్రయాణిస్తున్నారనే దానిపై విస్తృత మార్పును ప్రతిబింబిస్తుందని, ఎయిర్ బీఎన్బీ ప్రకారం,భారతీయ ప్రయాణికుల వేసవి శోధనలలో దాదాపు 40 శాతం సమూహ బసల కోసం, సన్నిహితమైన మరియు పంచుకునే అనుభవాల కోసం పెరుగుతున్న ప్రాధాన్యతను హైలైట్ చేస్తుందన్నారు. ప్రయాణికులు తమ సన్నిహిత సర్కిల్తో పాటు అర్థవంతమైన క్షణాలను జరుపుకోవడానికి ఎంచుకుంటున్నారని చెప్పారు.

# రెచ్చిపోతున్న ఇసుకాసురులు!?

- **చోద్యం చూస్తున్న అధికారులు,!?**
- **మామూళ్ల మత్తులో క్షేత్రస్థాయి సిబ్బంది!??**
- **మాయమవుతున్న ఖనిజ సంపద!?**

**అనకాపల్లి/మాడుగుల మార్చి 26(మనం న్యూస్):** నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా కోట్లాది రూపాయల విలువైన ఖనిజ సంపద తరలిపోతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. అనకాపల్లి జిల్లా వి మాడుగుల మండలం నుండి అనధికారికంగా పదుల కొద్ది వాహనాల ద్వారా ఇసుక తరలిపోతున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడం గమనార్హం. మాడుగుల మండలంలోని గోటివాడ సాగరం మధ్య నుండి ఇసుకను టిప్పర్లు ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు దర్జాగా తరలించకపోతున్నారు. నిత్యం తరలించకపోయి అక్రమార్కులు ఇసుకను వేళల్లో అమ్మి లక్షాధి రూపాయలు ఆర్జిస్తున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడం పై పలు విమర్శలు తలెత్తుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతం నుండి భారీ టిప్పర్లు లారీలు ట్రాక్టర్లు ద్వారా పాడేరు విశాఖ అనకాపల్లి ప్రాంతాలకు దర్జాగా తరలించిపోయి విక్రయించి తమ గల్లా పెట్టులు నింపుకుంటున్నారని ఆరోపణలు లేకపోలేదు.



# అచ్చం నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పల్లా..

**విశాఖపట్నం మార్చి 26(మనం న్యూస్):** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమలాభివృద్ధి మరియు మత్స్యశాఖ మంత్రి,టెక్కలి శాసనసభ సభ్యులు. కింజారపు అచ్చం నాయుడు.పుట్టినరోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు! ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఆరు సార్లు శాసనసభ్యునిగా విశిష్ట సేవలు అందించి, మాజీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులుగా పార్టీ బలోపేతానికి కృషి చేసి, ప్రస్తుతం వ్యవసాయ మత్స్య శాఖ మంత్రిగా ప్రజాసేవలో కొనసాగుతున్న మీ నాయకత్వం అందరికీ ప్రేరణగా నిలుస్తోందనీ. ప్రజల పట్ల మీ అంకితభావం మరింత విస్తరించి, ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాననీ. ఈ శుభదినం మీకు ఆనందాన్ని, ఉత్తమ ఆరోగ్యాన్ని, దీర్ఘాయువును మరియు మరింత విజయాలను తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాననీ పల్లా తెలిపారు.

# రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- **జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**



**విశాఖపట్నం మార్చి 26(మనం న్యూస్):** రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మధురవాడ జోన్ 6, 8 వార్డుల పరిధిలోని పోతిన మల్లయ్య పాలెం, వికలాంగుల కాలనీ లో రోడ్ల అభివృద్ధికై ప్రతిపాదించిన ప్రాంతాలను జోనల్ కమీషనర్ ఇప్పి నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ 6వ వార్డు పీఎం పాలెం నుండి సాయిబాబా గుడి వరకు 20 అడుగుల ఉన్న రోడ్డు 60 అడుగుల రోడ్డు గా విస్తరించేందుకు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ఆ రోడ్డుకు ఇరువైపు ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించి రోడ్డు విస్తరణకు అవసరమగు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం వార్డు నెంబర్ 8 వికలాంగుల కాలనీలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని ప్రతిపాదించగా రిటైనింగ్ వాలు కు బదులుగా 250 మీటర్ల లో 15 అడుగుల రోడ్డుతో పాటు కాలువలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ,అలాగే స్థానికులు కాలనీలోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని , పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు లేకుండా కాలువలు, వీధులు, రోడ్లు నిత్యం పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ ను కమిషనర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్, ఉపకార్య నిర్వహక ఇంజనీరులు మణికుమార్, సురేష్, సహాయక వైద్యాధికారి రవి పాల్గొన్నారు.

# ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డిని, కలసిన ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి



**పార్వతీపురం మార్చి 26 (మనం న్యూస్):** పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొని గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, పోలీస్ శాఖ చేపడుతున్న ప్రజా సేవలు, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, గిరిజన యువతలో అవగాహన పెంపొందించేందుకు, నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలపై ముఖ్యంగా ప్రజలకు న్యాయం వేగంగా అందించే విధానాలపై ఎస్పీ గారు వివరించారు. అదేవిధంగా ఎస్టీలపై దాడులకు సంబంధించి కేసులు వివరాలు తెలియజేసి, ఎస్టీలపై జరిగే దాడుల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కి తెలిపారు.

# మహిళా హోంగార్డుల కోసం విశ్రాంత గది
## ప్రారంభించిన సీపీ సతీమణి సువశ్రీ బాగ్చి




**విశాఖపట్నం మార్చి 26 (మనం న్యూస్):** విధినిర్మాణంలో మహిళ హోంగార్డులు అనేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారికి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నగర సిపి శంఖబ్రత బాగ్చి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా వారికి విశ్రాంతి గది ఏర్పాటు చేయాలని ఆ దిశలో చర్యలు చేపట్టారు.నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, నగరంలో మహిళా హోంగార్డుల కోసం ప్రత్యేకంగా ఒక వేచి ఉండే గది అందుబాటులోనికి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం సిపి సతీమణి సువశ్రీ బాగ్చి చేతుల మీదుగా మహిళా హోంగార్డుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంత గదిని ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు మహిళా హోంగార్డులు పాల్గొన్నారు.

# వైద్యులు, సౌకర్యాలు ఫుల్...! వైద్య సేవలు నిల్..?

**అనకాపల్లి /చోడవరం మార్చి 26 (మనం న్యూస్):** రాష్ట్రంలో పేద మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం పుణ్యమా అని రోగులకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు అనేది జగమెరిగిన సత్యం. ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో వైద్య సేవలో పూర్తిస్థాయిలో అందకపోవడానికి పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. దీంతో సిబ్బంది ఆడిందే ఆటగా పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారే తప్ప మానవతా దృక్పథంతో రోగులకు వైద్య సేవలు అందించడం లేదనేది ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. అనకాపల్లి జిల్లాలోని చోడవరం పరిసర ప్రాంతాల్లో గల ప్రభుత్వ వైద్య కేంద్రాల పరిస్థితి మరి దారుణంగా ఉంది. చోడవరం మండల కేంద్రంలో గల ప్రభుత్వ వైద్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్యులు ఉన్నారు. ఇక్కడ సూపరిండెంట్ గా విధులు నిర్వహిస్తున్న దినేష్ కుమార్ సుమారు రెండు నెలల క్రితం సెలవు పెట్టి వెళ్ళిపోయారు. ఆ స్థానంలో మరొకరిని ఇన్చార్జిగా వేయడమో, లేక మరొకరికి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించడమో అన్న విషయమై సంబంధిత జిల్లా వైద్యాధికారులు పట్టించుకోకపోవడంతో ఈ వైద్య కేంద్రం పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది ఆనక తప్పదు. ఈ వైద్య కేంద్రంలో మొత్తం పదిమంది వైద్యులకు గాను సూపర్డెంట్ సెలవుపై వెళ్లడంతో మిగిలిన 9 మంది వైద్యులు ప్రతిరోజు ఉదయం 9 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. గురువారం ఉదయం 10:30 నిమిషాలకు మనం ప్రతినిధి వైద్య కేంద్రానికి వెళ్ళగా వైద్యుల సీట్లు అన్ని ఖాళీగా దర్శనమిచ్చాయి. రోగులు ఫుల్లుగా కనిపించారు.



# ప్రధానిపై ఏఐ వీడియోలు
## ‘ఎక్స్’పై సైబర్ పోలీసుల కేసు

**ఢిల్లీ, మార్చి 26:** ఏఐ జనరేటెడ్ వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో విపరీతంగా వాడేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ప్రధాని మోడీ,ఎన్నికల కమిషనర్పై ఏఐ ఆధారిత వీడియోలు ఎక్స్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలోనే కేరళకు చెందిన సైబర్ పోలీసులు సదరు సామాజిక మాధ్యమంపై కేసు నమోదు చేశారు.‘‘ఆ వీడియోలు ప్రజలను తప్పుదారి పట్టించేలా, దేశ ప్రధాని, ఎలక్షన్ కమిషన్ పరువుకు భంగం కలిగేలా ఉన్నాయి. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపేవిధంగా వాటిని రూపొందించారు. అందుకే వాటిపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది’’ అని సైబర్ పోలీసులు వెల్లడించారు. ఎక్స్ సంస్థతో పాటు ఆ ఏఐ వీడియోలు పోస్ట్ చేసిన ఓ యూజర్ ఖాతాపై కూడా తిరువనంతపురంలోని సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సంక్షేమంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- **కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**విశాఖపట్నం, మార్చి 26:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై జిల్లా స్థాయి అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పలు కీలక సూచనలు చేశారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. వడగాలుల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ప్రజల్లో అవగాహన పెంచాలని, హీట్వేవ్ పరిస్థితులకు ముందస్తు సిద్ధత అవసరమని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేసిన కలెక్టర్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు నిధులు అందకపోతే వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. స్త్రీ శక్తి పథకాన్ని పక్కాగా అమలు చేయాలని, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ హెల్త్ మాడ్యూల్ అమలుతో పాటు వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అవసరమైన మరమ్మతులను వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇన్చార్జి డీఆర్వో శేషశైలజతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ,సిపి



**సింహాచలం మార్చి 26(మనం న్యూస్):** ఏప్రిల్ 20న జరగబోవు శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవ ఏర్పాట్లను విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం ఎం హరేంద్ర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఆలయ ఉన్నతాధికారులతో కలసి గురువారం పరిశీలించారు.
ఉచిత దర్శన క్యూ లైన్లను, ఇతర దర్శన క్యూ లైన్లను ఏర్పాటు చేసిన విధానం అధికారులతో కలిసి పూర్తిగా పరిశీలించారు, ట్రాఫిక్ రద్దీలను నివారిస్తూ, ప్రోటోకాల్ వాహనాల రాకపోకలతో పాటుగా సామాన్య భక్తులు సైతం యెటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ , లా అండ్ ఆర్డర్ విభాగాలు ఇతర శాఖలతో పూర్తి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని తెలియజేశారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో...
# దేశంలో ఊపందుకున్న పర్యాటకం



**ఢిల్లీ, మార్చి 26:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల్లో పర్యాటక రంగానికి బ్రేక్ పడింది. యుద్ధం వేళ ఆయా దేశాలకు వెళ్లేందుకు పర్యాటకులు భయపడుతున్నారు. ఈ క్రమంలోనే భారతీయులు కూడా గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు చేసుకొన్న తమ వేసవి విహారయాత్రలను రద్దు చేసుకుంటున్నారు. దీంతో మన దేశంలోని టూరిస్టు ప్రాంతాలకు డిమాండ్ పెరిగింది. ఈ పరిణామాలు స్వదేశీ పర్యటకానికి ఊతమిస్తున్నాయి. వేసవి సెలవుల్లో అమెరికా, ఐరోపా దేశాలను సందర్శించేందుకు ఇప్పటికే ప్రణాళిక వేసుకొన్న టూరిస్టులు పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి భయపడి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ పర్యటక ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు. లద్దాఖ్, రిషికేశ్, సిమ్లా, మనాలీ, షిల్లాంగ్ వంటి శీతల ప్రదేశాలను వేసవిలో సందర్శించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పర్యటకుల్లో దాదాపు 65% మంది దేశంలోని వివిధ ప్రాంతాలను చుట్టేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్ వంటి ప్రాంతాలకు గతంతో పోలిస్తే ఇప్పుడు 30శాతం బుకింగ్లు పెరిగాయి. 23శాతం మంది ఆధ్యాత్మిక పర్యటనలకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే విదేశీ పర్యటనలకు వెళ్లాలనుకునేవారు ఎక్కువగా వియత్నాం, నేపాల్, శ్రీలంక, ఇండోనేసియా, సింగపూర్, థాయ్లాండ్లను ఎంచుకుంటున్నట్లు ట్రావెల్ ఏజెన్సీల గణాంకాలు తెలిపాయి.

# అంగరంగ వైభవంగా మంత్రి అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు



**విజయవాడ, మార్చి 26:** రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు విజయవాడలోని క్యాంప్ కార్యాలయం లో అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరగగా, వివిధ వర్గాల ప్రజలు భారీగా హాజరై తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మంత్రికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యాలయ ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించేలా అలంకరించబడింది.

## బాధిత కుటుంబానికి భరోసానిచ్చిన ఎమ్మెల్యే



ముమ్మిడివరం, మార్చి 26, మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐ పోలవరం మండలం మురుమళ్ళ గ్రామంలో గల ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు కార్యాలయంలో గురువారం ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఒక కుటుంబం మూత్రపిండా మార్పిడి సహాయం నిమిత్తం దాట్ల సుబ్బరాజును అడుగగా ఆయన ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి,అవసరమైన సహాయాన్ని చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏ విధంగా సహాయం చేయాలనే అంశంపై వైద్యాధికారులతో వారి ఎదుటే ఫోన్లో చర్చించారు.

## స్వర్ణాంధ్రలో ముగిసిన జాతీయస్థాయి హ్యాకథాన్




నరసాపురం, మార్చి 26 (మనం న్యూస్) : నరసాపురం మండలం సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 26 న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, సైబర్ సెక్యూరిటీ అండ్ బిజినెస్ సిస్టమ్స్ డిపార్ట్మెంట్, ఆక్వాటెక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజన్ - ఎక్స్ 2026 జాతీయ స్థాయి హ్యాకథాన్ రెండవరోజు గురువారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుండి 64 టీములు, ఇతర రాష్ట్రాల నుండి 12 టీములు, స్వర్ణాంధ్ర కళాశాల నుండి 37 పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్ఆర్.కె.ఆర్ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి రూ. 30 వేలు, డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులు రెండవ బహుమతి రూ. 25 వేలు, ఎన్ఐటిఏపి విద్యార్థులు మూడవ బహుమతి రూ.20 వేలు, బెస్ట్ ఉమెన్ టీముగా స్వర్ణాంధ్ర విద్యార్థులు రూ. 15 వేలు, బెస్ట్ ఇన్నోవేషన్ టీముగా లక్కిరెడ్డి బాల్ రెడ్డి కళాశాల విద్యార్థులు రూ.10 వేల రూపాయలు బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి వెంకట సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, డైరెక్టర్ ఎస్. కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. గోపీచంద్ సిఎస్సీ విభాగాధిపతి డాక్టర్ పి శ్రీనివాసులు, డాక్టర్ బి మధుకుమార్, సిఎస్ అండ్ బి ఎస్ విభాగాధిపతి డాక్టర్ టి. మురళీమోహన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించే పని నాకు లేదు

- మాజీ మంత్రి మాజీ ఎంపీ తోట నరసింహం



జగ్గంపేట మార్చి 26 ( మనం న్యూస్): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జగ్గంపేట గ్రామపంచాయతీ పరిధిలో గల డ్రైవర్స్ కాలనీ ఇళ్ల స్థలాల వివాదంలో నాడు మాజీ మంత్రి తోట నరసింహం కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొని కలెక్టర్ వారికి వినతిపత్రం అందజేయడం జరిగింది, ఈ కలెక్టరేట్లో మీడియా సమావేశంలో మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడిన మాటలపై నేడు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రెస్ మీట్ నిర్వహించి నిజాలు మాట్లాడాలని ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని విమర్శించారు.మాజీ ఎంపీ తోట నరసింహం మాట్లాడుతూ 2010లో అప్పటి మంత్రిగా ఉన్న నేను డ్రైవర్స్ కాలనీ సర్వేనెంబర్ 196/2 లో సుమారు 200 మంది పేదలకు డ్రైవర్లు, ఆశ వర్కర్లు, సెక్స్ వర్కర్లు, పేదవారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే కార్యకర్తలకు ఆ స్థలాలను కేటాయించి ఆ స్థలాలలో గల లబ్ధిదారులను మరోచోట స్థలాలు ఇస్తామంటూ టిడిపి నేతలు బెదిరింపులు పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల స్టూడెంట్ విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తోట రాంజీ మరియు జగ్గంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇళ్ల స్థలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసా

- ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



నరసాపురం, మార్చి 26 (మనం న్యూస్): ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తోందని అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందులకు కారణంగా సరైన వైద్య సదుపాయం అందని బాధితులు తమ దృష్టికి తీసుకు వస్తే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వారికి కార్పొరేట్ వైద్య సహాయం అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామని అవసరమైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం ఆయన నరసాపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు,, వీర మహిళలు పాల్గొన్నారు.

## పప్పుధాన్యాల నిల్వలో జాగ్రత్తలు పాటించాలి

- మండల వ్యవసాయ శాఖ అధికారి పి. గాంధీ




శంఖవరం మార్చి 26 మనం ప్రతినిధిః పప్పుధాన్యపు పంటల కోత అంతరం సాంకేతికత మరియు పంట నిల్వ చేయుటలో సురక్షితమైన నిర్వహణ పద్ధతులు పాటించడం ద్వారా పంట ఉత్పత్తులను ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చని శంఖవరం మండల వ్యవసాయ శాఖ అధికారి పి. గాంధీ రైతులకు వివరించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా శృంగధార గ్రామంలో రైతులతో మినుము పొలం పరిశీలన చేసి పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అనంతరం పంట నిల్వ చేయుటలో సురక్షితమైన నిర్వహణ పద్ధతులు గుర్చి వివరించారు. గింజలో తేమ 12 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవడం ద్వారా పంట ఉత్పత్తులు తొందరగా పాడవకుండా చూడొచ్చని తెలిపారు. అనంతరం రైతులతో బృంద విన్యాసం చేయించి ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన సహాయకులు సువర్ణరాజు,ప్రసాద్,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



## వాకర్స్ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో మందుల పంపిణీ

పాలకొల్లు, మార్చి 26,మనం ప్రతినిధిః పాలకొల్లు పట్టణం మరియు రూరల్ కు చెందిన దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న 4 గురు పేద రోగులకు 20 వేల రూపాయలు విలువైన మందులను వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు సభ్యులతో కలిసి గురువారం కొత్త కుళాయి చెరువు వద్ద అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు,సభ్యులు జవ్వాజి కల్యాణ్, టంగుటూరి నాగేశ్వరరావు, కటారి నాగేంద్ర కుమార్, వెంకయ్య మాస్టారు పాల్గొన్నారు.

## లస్కర్ల జీతాల పెంపుపై హర్షం

- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును సన్మానించిన లస్కర్లు



ముమ్మిడివరం, మార్చి 26, మనం న్యూస్ః రాష్ట్ర ప్రభుత్వం లస్కర్ల జీతాలను పెంచిన నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ పోలవరం, తాళ్లరేవు మండలాల నుంచి లస్కర్లు గురువారం మురమళ్ళ క్యాంపు కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజును మరియు ఇతర సీనియర్ నాయకులను వారు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, లస్కర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా నెలకు రూ.6,000 జీతం పెంపు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు. లస్కర్లు సాగునీటి కాలువల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, వ్యవసాయానికి వారు అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పనులు కల్పించాలి

- వలసలు నివారించే చర్యలు చేపట్టాలి



ఏలేశ్వరం, మార్చి, 26:-(మనం న్యూస్): మండలంలో కూలీలకు ప్రభుత్వం తక్షణమే పనులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు లేకపోవడంతో కూలీలు పెద్దఎత్తున వలసలు వెళ్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఇతర మండలాలకు ఆటోలలో వెళ్లి పనులు చేసుకుంటున్నారు. మండలంలో పంటలు లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు గుంటూరు, విజయవాడ, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. కొంతమంది కూలీలు గుంటూరుకు మిర్చి కోత పనుల కోసం వెళ్లాల్సి వస్తోంది.

### సూరిబాబును పరామర్శించిన
## ఎమ్మెల్సీ తోట



ముమ్మిడివరం, మార్చి 26, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో సుదీర్ఘ కాలం పాటు మునసబుగా సేవలందించి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన గుంటముక్కల వీరబ్రద్రరావు చిత్ర పటానికి గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నివాళులు అర్పించారు. సోదరవియోగంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటముక్కల సూరిబాబును మరియు కుటుంబ సభ్యులను త్రిమూర్తులు పరామర్శించారు. ఈ పరామర్శలో చిక్కం హనుమంతరావు,సుంకర రామచంద్రరావు, గుంటముక్కల విష్ణు, తోట బాబి, మద్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల హక్కులకు భద్రత కల్పించండి



శంఖవరం మార్చి 26 మనం ప్రతినిధిః దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నానని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గునపర్తి అపురూప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల దళిత క్రైస్తవులపై వెలువడిన తాజా సుప్రీంకోర్టు తీర్పుపై తీవ్రంగా ఖండిస్తున్నానని భారత రాజ్యాంగం నేరుగా ఉల్లంఘిస్తున్నది అని ఆయన అన్నారు. ఆర్టికల్ 15 ప్రకారం మతం ఆధారంగా వివక్షత చూపరాదని అని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది అలాగే ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించొచ్చని రాజ్యాంగంలో స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి మతమార్పిడి చేసుకున్న కారణంగా ఆ వ్యక్తికి లభించే సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.

## పేకాట స్థావరాలపై పోలీసులు ఆకస్మిక దాడి




- అదుపులో 17 మంది, 9,650 రూపాయలు నగదు స్వాధీనం
- ఎస్సై టి. రామకృష్ణ కోటనందూరు

కోటనందూరు, మనం న్యూస్ మార్చి 26ః కాకినాడ జిల్లా,కోటనందూరు మండలం, అల్లిపూడి లో జూదం(కాయిన్స్) ఆడుతున్న స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసినట్లు ఎస్సై టి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ చెన్నకేశవరావు ఆదేశాలతో పక్కా సమాచారంతో 25-3-2026 తేదీ బుధవారం సాయంత్రం సమయంలో దాడి చేశామని ఈ సమయంలో 17 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు, వారి వద్ద నుండి 9,650 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో జూదం, అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

## కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



కోటనందూరు. మనం న్యూస్ మార్చి 26ః కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కస్తూరిబా బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సగిలి శాన్మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది .పాఠశాలలో గల తరగతి గదులు, వంట షెడ్డు, భోజన హలు, డార్మిటరీ,టాయిలెట్స్, ఆర్వో ప్లాంట్, పనితీరును స్వయంగా చూశారు. గ్యాస్ సరఫరా మరియు నిల్వ గురించి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తెలియజేయాలని ప్రిన్సిపాల్ కు సూచించారు.10వ తరగతి విద్యార్థులు వ్రాస్తున్న పరీక్షలు గుర్చి విద్యార్థినులతో మాట్లాడారు ఎలాంటి ఒత్తిడి లేకుండా మిగిలిన పరీక్షలను బాగా వ్రాయాలని 100% ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థినులకు సూచనలు ఇచ్చారు.పాఠశాల ప్రాంగణంలో గల నూతన భవన నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజేశ్వరి గారు పాఠశాల ప్రస్తుత పనితీరును కలెక్టర్ గారికి తెలియచేశారు ఎలాంటి అవసరాలు ఉన్నా ఇంటిమేట్ చేయాలని కలెక్టర్ తెలియజేశారు. పాఠశాలలో గల విద్యార్థుల హాజరు, బోధన సిబ్బంది హాజరు, పాఠశాల వసతి,ఆహారం, తాజా కూరగాయలు, ఆహార నిల్వలు వంటి నిర్వహణ సంతృప్తికరంగా ఉండటం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



నరసాపురం, మార్చి 26 (మనం న్యూస్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన జిల్లా న్యాయమూర్తి చైర్మన్ ఎస్. శ్రీదేవి గురువారం నరసాపురం సబ్ జైలులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, మంచినీటి సౌకర్యం, అనారోగ్యం పాలైన వారికి అందించే వైద్య సదుపాయాలను ముద్దాయిలను న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. జైలు ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని సూచించారు వంటశాల, స్టోర్ రూమ్ పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను రుచి చూసి జైలు సిబ్బందిని అభినందించారు. ఈ తనిఖీలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవితో పాట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్, నరసాపురం లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. రాజ్యలక్ష్మి, సబ్ జైలు పర్యవేక్షణ అధికారి టి. అప్పారావు, సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు కె. చిట్టిపద్మజ, ఎన్. కుమార్ రత్నం, పుల్లాజి, పూర్ణ రవిచంద్ర, నగేష్ కరుణాకర్, పి.ఎల్.వి.ఎస్. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## రైతుల అభివృద్ధే లక్ష్యం



వాసవి పెనుగొండ మార్చి 26 మనం న్యూస్ : పెనుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సాధారణ మహాజన సభ సొసైటీ ప్రాంగణంలో బుధవారం అధ్యక్షులు నక్క వేదవ్యాస శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో సొసైటీ త్రిసభ్య కమిటీ పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించింది.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు నక్క వేదవ్యాస శాస్త్రి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం పెరిగిందని అన్నారు. రైతులకు సబ్సిడీలు, రుణ సౌకర్యాలు, మద్దతు ధరల పరిరక్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తోందని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సహకారంతో ఆచంట నియోజకవర్గ ప్రాంత అభివృద్ధికి వేగం పెరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వేండ్ర మురళి, కానూరి వెంకట సత్యనారాయణ, సీఈఓ సూర్నీడి శ్రీరంగ సాయి పవన్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధే కూటమి ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ కామినేని



ముదినేపల్లి , మార్చి 26 (మనం న్యూస్): గ్రామీణ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆరోగ్యకరమైన తాగునీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి మండలంలోని వడాలి గ్రామంలో మంచినీటి సరఫరా పథకాన్ని జడ్పీ నిధులు 15 లక్షలతో మర మత్తు చేసిన ఫిల్టర్ బెడ్లను , ఉపాధి పథకం కింద రామాలయం వద్ద నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించగా మరో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పథకం నిర్వహణ సక్రమంగా ఉండాలని ప్రజలు దాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామములోని పలు సమస్యలను మహిళలు ఎమ్మెల్యే వద్ద ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , రాష్ట్ర టిడిపి కార్యదర్శి కొత్త నాగబాబు , ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ , మండల పార్టీ అధ్యక్షులు బొప్పన సుందర్రామయ్య , జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పోసిన పాండురంగారావు , చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి , చలసాని జగన్ మోహన్ రావు తదితర నాయకులు , గ్రామస్తులు పాల్గొన్నారు.



## ముద్రగడ నివాసంలో కీలక రాజకీయ భేటీ

- రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం

కిర్లంపూడి, మార్చి 26:( మనం న్యూస్ ): కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో జరిగిన కీలక రాజకీయ భేటీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ భేటీకి ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత నెలకొనగా, భవిష్యత్తు పరిణామాలపై ఆసక్తి వ్యక్తమవుతోంది. ఈ సమావేశానికి సీనియర్ నాయకుడు అంబటి రాంబాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరై ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు ముద్రగడ గిరిబాబుతో ఆత్మీయంగా సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల వ్యూహాలు, నియోజకవర్గ అభివృద్ధి, కార్యకర్తల సమస్యలు వంటి పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో పార్టీ స్థితిగతులు, నాయకత్వ సమన్వయం, గ్రామస్థాయి కార్యకర్తల పాత్రపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిసింది.

## కొత్తపేట గ్రామంలో 100 కెవి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం



పాలకొల్లు, మార్చి 26,మనం ప్రతినిధి : పాలకొల్లు మండలం కొత్తపేట గ్రామంలో 100 కె.వి విద్యుత్ ట్రాన్సార్మర్ను కూటమి నాయకులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ కోడి జభాస్కర్, సర్పంచ్ కౌరుభారతి భాస్కరరావు, ఎంపీటీసీ వెంకటరత్నం, కౌరు మురళీకృష్ణ, కౌరు సందీప్ కుమార్, అందే కోటి వీరభద్రం, అంబాటి శేషగిరి, పోతుల సూరిబాబు, రాయ ప్రసాద్, పితాని దుర్గారావు ఇబ్బ రాంబాబు, కేతా రామకృష్ణ, గుబ్బల రామకృష్ణ, గుబ్బల నాగేశ్వరరావు, కట్ట మురళీధర్, కేతా సత్యనారాయణ, కేతరాజు, మల్లా సాంబమూర్తి, శీలంఅశోక్ కుమార్ గ్రామ ప్రజలు తదితరు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన

సమగ్ర ప్రణాళికతో ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం

పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్దశ

దేశంలోనే మొదటి సారి మహిళలకు ఆస్తిలో సమాన హక్కు

నారా భువనేశ్వరి





విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్దశ పట్టబోతోందని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా 3వ రోజు భువనేశ్వరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా శాంతిపురం మండలం శివపురం లోని నివాసంలో స్థానిక నేతలతో నారా భువనేశ్వరి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం శాంతిపురంలో అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐటీడీపీ కార్యకర్త రవి కుటుంబసభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. రామకుప్పం,మణేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. రామకుప్పంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామకుప్పం మండలం బల్ల గ్రామంలో మహిళలతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. అనంతరం రామకుప్పంలో టీడీపీ కార్యకర్త ముజాహిద్ ఇంటికి వెళ్లి కుటుంసభ్యులతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి రామకుప్పం మండలం గోవిందపల్లి గ్రామానికి వెళ్లిన నారా భువనేశ్వరి ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్త ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

**ఎన్టీఆర్ హయాంలో మహిళాభ్యున్నతికి బాటలు**

కుప్పం నియోజకవర్గం రామకుప్పంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో కిలోమీటరు మేర వారితో పాటే భువనేశ్వరి కలిసి నడిచారు. విగ్రహావిష్కరణ అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు రూ. 2 కే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్. మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారు. రిజర్వేషన్లు కల్పించారు. ప్రత్యేకంగా మహిళల కోసం పద్మావతి మహిళా యూనివర్సిటీ స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. డ్వాక్రా స్థాపించి మహిళల ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రవేశపెట్టారని నారా భువనేశ్వరి అన్నారు. అనంతరం రామకుప్పంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి భువనేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు.

**కుప్పం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక**

రామకుప్పం మండలం బల్ల గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ...ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు గారు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర, స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం చంద్రబాబు గారి సమర్థ నాయకత్వానికి నిదర్శనం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ , అనకాపల్లి జిల్లాలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటవుతున్నాయి. చంద్రబాబు గారిని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు రుణపడి ఉంటాం. కుప్పానికి పరిశ్రమల రాకతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఆర్థిక సాయం చేస్తున్నారు. దీపం పథకం ద్వారా మహిళలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు సంజీవని ప్రాజెక్టు తెచ్చారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. హంద్రినీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చారు. డ్వాక్రా స్థాపించి మహిళలకు ఆర్థిక భద్రత కల్పించారు. కుప్పంలో ఎలీప్ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. చంద్రబాబు గారికి ప్రజలే ముఖ్యమని, సాయం కోసం వచ్చిన వారు ఏ పార్టీ అని ఆలోచించరని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటారని నారా భువనేశ్వరి తెలిపారు.

# ఆర్కే బీచ్‌లో దేశంలోనే అత్యంత ఎత్తైన ఇసుక బకెట్‌ను ఆవిష్కరించిన కేఎఫ్సీ




విశాఖపట్నం మార్చ్ 25 విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ అంటేనే ఎన్నెన్నో విశేషాలు- ఉవ్వెత్తున ఎగిసిపడే అలలు, ఉదయపు నడకలు, సాయంత్రపు విహారాలు, అప్పుడప్పుడు కనిపించే ఇసుక కోటల సమాహారం. కానీ ఈ వారం, ఇసుకతో భారీ పరిమాణంలో కేఎఫ్సీ బకెట్ ఒకటి ఆవిర్భవించడంతో బీచ్కు వచ్చినవారు ఆశ్చర్యానికి లోనయ్యారు. స్థానిక స్యాండ్ ఆర్టిస్ట్ ఆకునూరు బాలాజీ వరప్రసాద్ కేవలం బీచ్ ఇసుకను మాత్రమే ఉపయోగించి, 48 గంటల పాటు శ్రమించి దీన్ని రూపొందించారు. ఈ అద్భుతమైన కళాఖండాన్ని రూపొందించేందుకు 7 టన్నులకు పైగా ఇసుకను వినియోగించారు. ఈ కళాఖండం ప్రపంచంలోనే అత్యంత గుర్తింపు పొందిన బ్రాండ్ చిహ్నాలలో ఒకటిగా మార్చింది. ఆకునూరు బాలాజీ వరప్రసాద్ శిల్పి మరియు ఒక ప్రఖ్యాత స్యాండ్ ఆర్టిస్ట్. ఆయన ఆంధ్రప్రదేశ్లోని పేరుపాలెం, మంగినపూడి, బాపట్ల బీచ్లతో పాటు భారతదేశంలోని పలు బీచ్లలో 700కు పైగా ఇసుక శిల్పాలను రూపొందించారు. ఆయన కోనార్క్ అంతర్జాతీయ ఇసుక కళా ఉత్సవంలో నాలుగుసార్లు విజేతగా నిలిచారు. ఖతార్, యూరప్లలో నిర్వహించిన అంతర్జాతీయ స్యాండ్ ఆర్ట్ పోటీలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. బీచ్ రోడ్లో కేఎఫ్సీ తన సరికొత్త రెస్టారెంట్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిల్పాన్ని రూపొందించారు. దీనితో విశాఖపట్నంలోని ఈ సుపరిచితమైన ప్రదేశం ఒక ఆకర్షణీయమైన ఫోటో స్పాట్గా మారింది. ఆసక్తిగల సందర్శకులు నిరంతరం ఇక్కడ ఆగి ఫోటోలు తీసుకునేందుకు, వీడియోలు చిత్రీకరించుకునేందుకు, ఈ ఊహించని దృశ్యాన్ని ఆన్లైన్లో స్నేహితులతో పంచుకునేందుకు ఆసక్తి చూపిస్తూ వస్తున్నారు. విశాఖపట్నానికి ఉన్న విశాలమైన సముద్రతీరం నేపథ్యంలో 2,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 70 సీట్ల సామర్థ్యం గల ఈ రెస్టారెంట్ తన సముద్ర సంబంధిత పరిసరాల నుంచి ప్రేరణ పొందింది. ఈ ప్రదేశానికి ప్రధాన ఆకర్షణగా పడవ స్ఫూర్తితో చేసిన అలంకరణ, వెదురుతో కప్పబడిన ముఖభాగం, సముద్రం వైపు చూసే సీటింగ్ ఉన్నాయి. ఇవి బీచ్కు వచ్చేవారు సేదతీరి, నోరూరించే ఆహారాన్ని ఆస్వాదించేందుకు ఒక ప్రశాంతమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. అలల ఒడ్డున విహరించిన తర్వాత, బీచ్కు వెళ్లేవారు తమకు ఇష్టమైన హాట్ క్రిస్పీ చికెన్, హాట్ వింగ్స్, చికెన్ పాప్కార్న్, పెరి పెరి బోన్లెస్ స్ట్రిప్స్, జింగర్ బర్గర్స్, రోల్స్, రైస్ బౌల్జ్ తదితర కేఎఫ్సీ వంటకాలను ఆరగించేందుకు ఈ కొత్త రెస్టారెంట్ ఒక సరైన గమ్యస్థానం. బీచ్ రోడ్లో కొత్తగా ప్రారంభమైన ఇది, నగరంలో 14వ కేఎఫ్సీ రెస్టారెంట్. మరి వైజాగ్ వాసులారా, ఇంకెందుకు ఆలస్యం? ఇప్పుడే కేఎఫ్సీ బీచ్ రోడ్కు వచ్చి, మీరే స్వయంగా అనుభూతి చెందండి.

## పులి దాడిలో చనిపోయిన దూడకు రూ.18,000 నష్టపరిహారం పంపిణీ




ఏలేశ్వరం,మార్చి, 26:-(మనం న్యూస్)ః ఈ నెల 20.03.2026న మర్రివీడు గ్రామంలో కొనుసూరి రాంబాబు (తండ్రి నాగన్న) కు చెందిన గేదె దూడ పులి దాడిలో మృతి చెందినది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు స్పందించి, బాధితునికి తక్షణ సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా అటవీ శాఖాధికారి ఎన్. రామచంద్రరావు చొరవతో, బాధితునికి రూ.18,000 నష్టపరిహారం మంజూరు చేయబడింది. ఈ నష్టపరిహారాన్ని ఈ రోజు అనగా 26.03.2026న ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చేతుల మీదుగా డీడీ రూపంలో బాధితుడికి అందజేయడమైనది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పులి దాడులతో రైతులు, పశువుల యజమానులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అటవీ శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. దుర్గారామ్ ప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎమ్. జాన్సన్, అటవీ శాఖ సిబ్బంది, కంబాలపాలెం గ్రామ ఎంపీటీసీ కొప్పుశెట్టి సూరిబాబు, నాయకులు బుజ్జి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరా పై అపోహలు సృష్టిస్తే కఠిన చర్యలు



అమలాపురం మార్చి 26 : మనం న్యూస్ః ఎల్పిజి గ్యాస్ సరఫరా పై అపోహలు సృష్టిస్తే కఠిన చర్యలు గైకొనడం జరు గుతుందని జిల్లా పౌరస రఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులకు సూచించారు.గృహ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వాడ వద్దన్నారు.గ్యాస్ విని యోగంపై ఎవరైనా అనవసర ప్రచారాలు నిర్వహించి అపోహలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ కొరత నేపథ్యంలో గృహ గ్యాస్ వినియోగానికి సంబంధించి కోనసీమ జిల్లాలో ఎలాంటి కొరత లేదన్నారు. అయితే గ్యాస్ కొరత ఏర్పడుతున్న ఉద్దేశంతో కొంతమంది అధిక బుకింగ్ చేసుకోవడం వల్ల సాంకేతిక సమస్య ఏర్పడుతోందని, గ్యాస్ సరఫరాలో ఎలాంటి లోపాలు లేవన్నారు. గ్యాస్ బుకింగ్, సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే కమాండ్ కంట్రోల్ నెంబర్. 94416 92275 లో ఫిర్యా దు చేయవచ్చన్నారు.గృహ అవసరాలకు ఉపయోగిం చే గ్యాస్ సిలిండర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వాణిజ్య అవసరాలకు వినియోగిం చరాదన్నారు.అలా విని యోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హోట ల్ రెస్టారెంట్ క్యాటరింగ్ యాజమాన్యాలను హెచ్చ రించారు. ఏ విధంగా గ్యాస్ ఏజెన్సీల నిర్వహకులు గృహ అవసరాల సిలిండ ర్లను వాణిజ్య అవసరాల కు విక్రయిస్తే ఆయా ఏజె న్సీలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలాల్లోని తహసిల్దార్లు, సివిల్ సప్లై జె డిప్యూటీ తహసిల్దార్ ను ప్రతిరోజు గ్యాస్ ఏజెన్సీల్లో నిలువలను పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదిక లను పంపాలన్నారు. అదేవిధంగా హోటళ్లు, రెస్టారెంట్లు, తోపుడు బండ్ల పై నిర్వహించే హోటళ్లపై తనిఖీలు నిర్వహించి గృహ అవసర సిలిండర్లను వినియోగిస్తున్నట్లయితే నిత్యావసరాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని డీఎస్ఓ ఆదే శించారు.

## శభాష్ సిఐ సుబ్బారావు సార్



మార్కాపురం,మార్చి, 26,(మనం న్యూస్) ప్రాణాల సైతం లెక్కచేయకుండా క్షతగాత్రులను కాపాడిన మార్కాపురం సిఐ సుబ్బారావు మార్కాపురం మండలం రాయవరం మెడికల్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు సమాచారాన్ని తెలుసుకున్న సీఐ సుబ్బారావు వెంటనే అగ్ని ఆహుతి అయిన బస్సులకు ఎక్కి క్షతగాత్రులను బయటకు తీయడంలో కీలకపాత్ర పోషించారు బస్సులో ఒకవైపు మంటలు వస్తున్న మరొకవైపు క్షతగాత్రులను బయటకు తీసేందుకు అహర్నిశలు శ్రమించి క్షతగాత్రులను బయటికి తీశారు .

## బళ్ళారి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, విఎంఆర్డిఏ చైర్మన్ భేటీ



విశాఖపట్నం మార్చి 26 (మనం న్యూస్) కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (బి యు డి ఎ) చైర్మన్ ఆంజనేయులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల బృందం గురువారం వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్, ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు గురించి వివరించారు. అదేవిధంగా విఎంఆర్డిఏ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ఇస్తున్న ప్రాధాన్యత, నిధులు కేటాయించడం, పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి, పర్యాటకులను ఆకర్షించడానికి తీసుకున్న చర్యలు, సాహస క్రీడలు ఏర్పాటు వంటి అంశాల గురించి వివరించారు. నగర పరిధిలో పార్కు లు, మ్యూజియంల నిర్వహణ, పచ్చదనం పెంపొందించటం తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో బళ్ళారి మేయర్ మరియు బి యు డి ఎ సభ్యులు గెడ్డప్ప, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బి యు డి ఎ చైర్మన్ ఆంజనేయులు ని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్,కార్యదర్శి మురళీకృష్ణ, ముఖ్య ప్రణాళికాధికారిణి శిల్పా, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్ ప్లానింగ్ ఆఫీసర్లు మౌనిక, కిషోర్ పాల్గొన్నారు.

# స్టోవ్క్రాఫ్ట్ నుండి సంప్రదాయ మరియు సాంకేతికతను కలిపి 'పిజన్ ఎలక్ట్రిక్ మురుకుల మేకర్'



అమరావతి, 26 మార్చి 2026: భారతదేశంలోని ప్రముఖ కిచెన్ ఉపకరణాల తయారీ సంస్థలలో ఒకటైన స్టోవ్క్రాఫ్ట్ లిమిటెడ్, అలాగే ప్రసిద్ధ పిజన్ బ్రాండ్ కిచెన్ అప్లయెన్సులు మరియు కుక్వేర్ తయారీదారు, పిజన్ ఎలక్ట్రిక్ మురుకుల మేకర్ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ బహుముఖ విద్యుత్ పరికరం మురుకులు, శవిగె, చక్లీ, సేమియా మరియు నూడుల్స్, స్పగెట్టి పాస్తా వంటి భారతీయ ప్రసిద్ధ స్నాక్ వంటకాలను సులభంగా తయారు చేయడానికి సహాయపడుతుంది. ఇప్పటివరకు భారతీయ కుటుంబాలు ఉపయోగించిన సంప్రదాయ పరికరాలకు ఇది వేగవంతమైన మరియు సౌకర్యవంతమైన ప్రత్యామ్నాయం. సంప్రదాయ పరికరాలు ఉపయోగించడం చాలా కష్టమైన మరియు శ్రమతో కూడుకున్నది. మురుకులు తయారీలో ఆధారపడిన ఈ పరికరం, సంక్రాంతి మరియు దీపావళి వంటి పండుగలు, కుటుంబ సమావేశాలు మరియు టీ సమయపు తినుబండారాల కోసం ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ కరకరలాడే స్నాక్ను తయారు చేయడంలో మాత్రమే కాకుండా, ఇతర అనేక వంటకాలను తయారు చేయడానికీ ఉపయోగపడుతుంది. రిబ్బన్ పకోడాలు, పాయసం కోసం సేమియా, ఇంట్లో తయారుచేసిన నూడుల్స్, స్పగెట్టి తరహా పాస్తా వంటి వివిధ వంటకాలను తయారు చేయడానికి ఇది సహాయపడుతుంది. ఇది మారుతున్న వంట అలవాట్లు మరియు అభిరుచులకు అనుగుణంగా పనిచేస్తుంది.ఈ పరికరంలో ఆరు మార్చుకునే మోల్డు / జాలీలు ఉండటం దీని ప్రత్యేకత. వీటి ద్వారా వివిధ ఆకారాలు, టెక్స్చర్లు మరియు వంటకాలను సులభంగా ప్రయోగించవచ్చు. ఇది రోజువారీ వంటగదిలో ఉపయోగపడే బహుళ ప్రయోజనాల పరికరంగా నిలుస్తుంది. సాంప్రదాయ మాన్యువల్ ప్రెస్ పరికరాలు ఎక్కువ శ్రమ మరియు సమయం అవసరం పడతాయి. అందువల్ల వాటిని ఎక్కువగా ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఉపయోగిస్తారు. ఆధునిక జీవనశైలిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన పిజన్ ఎలక్ట్రిక్ మురుకులు మేకర్ బ్యాటరీ ఆధారితంగా పనిచేస్తుంది. ట్రిగ్గర్-ప్రెస్ ఆపరేషన్ మరియు సి-టైప్ ఛార్జింగ్ సౌకర్యంతో వస్తుంది. తక్కువ శ్రమతో సమానమైన ఫలితాలను ఇస్తూ, సంప్రదాయ రుచిని అలాగే ఉంచుతుంది.

## నెల్లిపూడిలో టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

- బద్ది బ్రదర్స్ ఆధ్వర్యంలో నిరసనకు దిగి వచ్చిన కాంట్రాక్టర్లు..



శంఖవరం మార్చి 26 మనం ప్రతినిధి: గ్రామీణ వాతావరణాన్ని, గ్రామీణుల జీవన శైలిని అస్తవ్యస్తం చేస్తున్న భారీ టిప్పర్లను నెల్లిపూడి గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. శంఖవరం మండలంలోని నెల్లిపూడి గ్రామంలో టిడిపి అధికార ప్రతినిధి బద్ది వెంకటరమణ, టిడిపి మండల పూర్వ అధ్యక్షుడు బద్ది రామారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బద్ది వెంకటరమణ మాట్లాడుతూ గ్రామం మీదుగా వెళుతున్న టిప్పర్ల వల్ల చెలరేగే దుమ్ము, దూళితో తరచూ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, రహదారి వెంబడి ఉన్న గృహాలన్నీ దూళితో నిండిపోవుచున్నాయన్నారు. ఈ రహదారిపై రేయింబవళ్ళు తిరుగుచున్న టిప్పర్లు కనీస రహదారి భద్రత నియమాలు కూడా పాటించడం లేదని, గృహ సముదాయాలు, పాఠశాలల వద్ద వేగం తగ్గడం లేదు సరికదా.. గ్యాస్ హారన్ లను మోగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దుమ్ము, దూళి నుండి విముక్తికై కనీసం రహదారిని తడపడం లేదన్నారు. ఈ సమయంలో కేవలం టిప్పర్లను మాత్రమే అడ్డుకోగా, అన్నవరం అడిషనల్ ఎస్సై లాలం ప్రసాద్ తన సిబ్బందితో ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ బస్సులను, ఆటోలను ఎప్పటికప్పుడు పంపించివేశారు. టిప్పర్ల రాకపోకలు నిలిచి పోవడంతో వచ్చిన ఎస్సై శ్రీహరిబాబు నిరసనకారులతోనూ, మొబైల్ ఫోన్లో టిప్పర్ల కాంట్రాక్టర్లతోనూ చర్చలు జరిపారు. దీనితో దిగివచ్చిన కాంట్రాక్టర్లు ఉదయం, సాయంత్రం రహదారిని తడిపేందుకు అంగీకరించడంతో నెల్లిపూడి గ్రామస్థులు శాంతించి, నిరసన విరమించారు. ఈ నిరసనలో బద్ది బ్రదర్స్ తోపాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి స్పెషల్.. ఇరుముడి టీమ్ ప్రత్యేక పోస్టర్



రవితేజ హీరోగా వస్తోన్న తాజా చిత్రం ఇరుముడి. ఈ చిత్రంలో మాస్ మహారాజా అయ్యప్పదీక్షలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ చూస్తే డెవోషనల్ టచ్ తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. తండ్రీ, కూతుళ్ల బంధం నేపథ్యంలో ఈ మూవీని రూపొందిస్తున్నారు.

తాజాగా ఇరుముడి టీమ్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేసింది. ప్రేమ, ఆప్యాయత గల తండ్రి.. ముచ్చటైన కూతురి కథ.. అంటూ మైత్రి మూవీ మేకర్స్ పోస్ట్ చేసింది. ఈ పోస్టర్ తోనే కథేంటో మేకర్స్ రివీల్ చేశారు. ఈ ఏడాది రవితేజ బర్త్ డే సందర్భంగా మూవీ టైటిల్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ఏడాదిలోనే విడుదల కానుంది.

# సిద్ధం కండి 'పెద్ది' బిగ్ ట్రీట్‌కి..



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే పెద్ది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ సినిమా పట్ల అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అయితే ఈ రోజు 27న రామ్ చరణ్ పుట్టినరోజు కానుకగా ఓ బిగ్ ట్రీట్ ని ఆశిస్తున్నారని తెలిసిందే. మరి ఫైనల్ గా దీనిపై మేకర్స్ బిగ్ అప్డేట్ అందించారు. ఒక గదాదండం తో డిజైన్ చేసిన సరికొత్త పోస్టర్ తో టైం ని రివీల్ చేసారు. ఇది వరకు తమ పెద్ది ని బ్యాట్ తో చూసారు. ఈసారి మరోలా చూడబోతున్నారు అంటూ ఈ రోజు ఉదయం 9 గంటల 35 నిమిషాల సమయాన్ని ఖరారు చేసారు. సో ఈసారి కూడా మోత గట్టిగానే ఉంటుందని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే వృద్ధి సినిమాస్ వారు ఏప్రిల్ 30న గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు.

ఐపీఎల్ 2026..

# పూర్తి షెడ్యూల్ వచ్చేసింది

ఐపీఎల్ 2026 సీజన్ కు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ ను బీసీసీఐ విడుదల చేసింది. ఇంతకుముందు తొలి దశలో కేవలం 20 మ్యాచులకు మాత్రమే వేదికలు, తేదీలను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో దశలో 50 మ్యాచులకు షెడ్యూల్ ను విడుదల చేసింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచులకూ షెడ్యూల్ ప్రకటించినట్లైంది. అయితే, ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. మార్చి 28 నుంచి మే 24 వరకూ జరగనున్న లీగ్ స్టేజ్ మ్యాచ్ ల వివరాలను ప్రకటించింది. బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - సన్రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్ తో 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. లీగ్ స్టేజ్ కోల్ కతా నైట్రైడర్స్ రిట దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ తో ముగియనుంది. ఈ మ్యాచ్ కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది.



**క్యాచులపై క్లారిటీ**

క్యాచుల విషయంపై ఇప్పటికే పది జట్ల సారథులకు బీసీసీఐ క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కెప్టెన్లతో జరిగిన సమావేశంలో అందుకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి చూపించారని సమాచారం. క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్ కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్ లో కాస్త చర్చకు దారితీసిన క్యాచుల వీడియోలను ప్రదర్శించింది.

## సన్ రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త

సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ కొంతకాలంగా వెన్ను గాయంతో ఇబ్బందిపడుతున్న విషయం తెలిసిందే. అతడు ప్రస్తుత ఐపీఎల్ 2026లో ఆడే విషయమై అనిశ్చితి నెలకొంది. అయితే కమిన్స్.. అభిమానులకు ఓ శుభవార్త తెలిపాడు. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టులోకి వస్తానని చెప్పాడు. బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్ లో అతడు పాల్గొన్నాడు. వార్మప్ లు, ఫీల్డింగ్, క్యాచ్ లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్ తో ఖాళీ నెట్స్ లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు. 'నేను వెన్ను గాయం నుంచి ఇంకా కోలుకుంటున్నా. కానీ ప్రస్తుతం బాగుంది. ఇప్పుడు నెట్స్ లో బౌలింగ్ చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ప్రారంభ మ్యాచుల్లో ఆడలేకపోతున్నా. టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశముంది.

# రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి చాటి చెప్పడానికే శాసనసభ్యుల క్రీడా పోటీలు

- మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026



రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కష్ణారావు వాకిటి శ్రీహరి లు తెలిపారు. ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం ఈరోజు అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**28న ప్రారంభం :**

మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్ లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

# మేము విడిపోవాలని కోరుకుంటున్నారా..

"నేను నా భర్త నిక్ జొనాస్.. బయటి విషయాల కంటే కూడా మమ్మల్ని మేం పట్టించుకుంటూ సంతోషంగా ఉంటున్నామ"ని అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్టులతో పాటు రాజమౌళి- మహేశ్ బాబు కలయికలో వస్తోన్న 'వారణాసి'లో కథానాయికగా నటిస్తోంది. ఆమె.. కెరీర్ గురించే కాదు.. అవకాశం వచ్చినప్పుడల్లా వ్యక్తిగత జీవితం గురించి కూడా అభిమానులతో పంచుకుంటుంది. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక చెప్పిన ఆసక్తికర సంగతులు.



"మేం విడాకు లు తీసుకుంటున్నా మంటూ కొన్ని వార్తలు నా చెవిన పడ్డాయి. మా పెళ్లి బంధం ముగిసిపోవాలని కోరుకుంటున్నారా? అస్సలు ఎందుకు మా బంధం గురించి ఇలాంటి రూమర్లు వస్తున్నాయో తెలియడం లేదు. అయినా ఇదంతా వాళ్ల భ్రమ. మా ఇద్దరి మధ్య బంధం కొందరికి ఎందుకు ఇంత ఇబ్బంది కలిగిస్తుందో అర్థం కావడం లేదు. బహుశా వేర్వేరు దేశాలు, వేర్వేరు మతాలు, వయసు తేడా అయి ఉండవచ్చు. మేము ఎనిమిదేళ్లుగా కలిసే ఉంటున్నాం. ఇతరులు ఏమనుకుంటున్నారో అని ఆలోచించడం మానేశా. మా పరిచయం తర్వాత ఆరు నెలల్లోనే పెళ్లి చేసుకున్నాం. అప్పుడు అది నిజమో కాదో కూడా తెలియని పరిస్థితుల్లో ఉండిపోయా. అయితే నిక్ లో నిజాయతీ ఉంది".

**నాకు భద్రత అవసరం లేదు**

"మా కుటుంబ భద్రత విషయంలో కూడా నేను చాలా జాగ్రత్తగా ఉంటా. ముఖ్యంగా మా కుమార్తె గురించి మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తాను. ఎవరైనా నన్ను సంప్రదించి ఫొటోలు తీసుకోవడం నాకిష్టం. నాతో మాట్లాడటానికి వచ్చే వ్యక్తులను నేను ఇష్టపడతానని మా సెక్యూరిటీ గార్డులకు తెలుసు. అనుమతి లేకుండా మమ్మల్ని ఫొటోలు తీయకుండా వారు చూసుకుంటారు. ఈరోజుల్లో ప్రతి ఒక్కరి దగ్గర సెల్ ఫోన్లు ఉంటున్నాయి. మేము పార్కులో ఉన్నా.. ఏదైనా తింటున్నా కూడా క్షణాల్లో దాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. అందుకే నా కూతురి కోసం సెక్యూరిటీని పెట్టుకున్నా. లేకపోతే నాకు భద్రత అవసరం లేదు".

**ఉద్యోగాలు నచ్చకపోయినా..**

"నా దృష్టిలో నిజమైన విజయం అంటే నేను ఇష్టపడే వృత్తిలో పనిచేయడం, కుటుంబం కోసం సమయం కేటాయించడం మాత్రమే. జీవితంలో చాలా మంది రోజూ పనిచేయాల్సి ఉంటుంది. కొంతమందికి వారు చేసే ఉద్యోగాలు కూడా నచ్చవు. కానీ వారు బతకడం కోసం, కుటుంబాలను పోషించడం కోసం ఉద్యోగం చేయాలి. నాకు అదే విజయమని భావిస్తున్నా".

**ఇప్పుడు నా ఇష్టం**

"ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో బాలీవుడ్ లో మంచి పేరును సంపాదించుకున్నా. ఆ తర్వాత 30ఏళ్ల వయసులోనే హాలీవుడ్ లో అడుగుపెట్టినప్పుడు మళ్లీ కెరీర్ ప్రారంభించిన అనుభూతి కలిగింది. నేను సురక్షితంగా ఉన్నా. ఆర్థికంగా కూడా బాగానే ఉన్నా. మంచిగా స్థిరపడ్డాను. అయినా అన్నింటినీ వదులుకొని హాలీవుడ్ కి వెళ్లడం ఆందోళనగా అనిపించింది. అక్కడ నా సినీ కెరీర్ ను మొదలెట్టిన కొత్తలో స్టీరియోటైప్ పాత్రలే ఎక్కువ వచ్చేవి. ఇప్పుడు నాకు ఇష్టం ఉన్న పాత్రల్నే ఎంపిక చేసుకోగలుగుతున్నా".

# రామ్ చరణ్ కంటికి సర్జరీ..

రామ్ చరణ్ 'పెద్ది' షూటింగ్లో గాయపడిన విషయం తెలిసిందే. ఆయన కంటికి చిన్న సర్జరీ జరిగినట్లు చిరంజీవి సోషల్ మీడియాలో వెల్లడించారు. చరణ్ కు సర్జరీ చేసిన వైద్యులకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సర్జరీ గురించి చిరంజీవి స్పందిస్తూ.. "చరణ్ కనురెప్పకు మీరు సరైన సమయంలో, ఎంతో నైపుణ్యంతో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. మొదట మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ, మీ మాటలు భయాన్ని పోగొట్టి ధైర్యాన్నిచ్చాయి" అని పేర్కొన్నారు. చికిత్స అందించిన వైద్యులకు తమ కుటుంబం ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని చిరంజీవి తన పోస్ట్లో రాసుకొచ్చారు.

# నందమూరి బాలకృష్ణకు IFFDలో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు..!



టాలీవుడ్ లో ఐదు దశాబ్దాలుగా తిరుగులేని హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక పేజీని క్రియేట్ చేసుకున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం లభించింది. ఢిల్లీలోని భారత్ మండపంలో ఘనంగా జరిగిన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఢిల్లీ' 2026 వేడుకల్లో ఆయనకు ప్రతిష్టాత్మక 'లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు' అందజేశారు. తన 50 ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో వైవిధ్యమైన పాత్రలు, అంకితభావంతో భారతీయ సినిమాకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. మార్చి 25, 2026న న్యూఢిల్లీలో జరిగిన ఈ వేడుకలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా చేతుల మీదుగా బాలయ్య ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సినీ, రాజకీయ మరియు సాంస్కృతిక రంగాల ప్రముఖులు పాల్గొని ఆయనను అభినందించారు. ఇప్పటికే ఆయన నటించిన 'భగవంత్ కేసరి' చిత్రం 71వ జాతీయ చలనచిత్ర అవార్డులలో ఉత్తమ తెలుగు చిత్రంగా నిలవగా, 2025లో భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్' పురస్కారం తో గౌరవించిన సంగతి తెలిసిందే. పౌరాణిక పాత్రలైనా, మాస్ యాక్షన్ చిత్రాలైనా తనదైన శైలిలో మెప్పించడం బాలకృష్ణకే సాధ్యం. దశాబ్దాలుగా వెండితెరపై ఆయన చూపిస్తున్న ప్రభావం మరియు ప్రేక్షకులతో ఆయనకున్న అనుబంధం ఈ అవార్డు ద్వారా మరోసారి నిరూపితమైంది. ఐఊఊఊ్ర 2026 వేదికగా దక్కిన ఈ గౌరవంతో బాలయ్య అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రదీప్ రంగనాథన్ సినిమా వాయిదా.. కారణం అదేనా?



కుర్రకారులో మంచి క్రేజ్ సంపాదించుకున్న టాలెంటెడ్ యాక్టర్ ప్రదీప్ రంగనాథన్ కొత్త సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రదీప్ హీరోగా విఘ్నేష్ శివన్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న రొమాంటిక్ కామెడీ మూవీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' పై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, ఈ సినిమా రిలీజ్ కు సంబంధించి ఇప్పుడు ఓ షాకింగ్ న్యూస్ కోలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రం మరోసారి వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

హీరోకి ఇవ్వాల్సిన పారితోషికం విషయంలో తలెత్తిన వివాదమే ఈ వాయిదాకు కారణమని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. ప్రదీప్ రంగనాథన్ కు సంబంధించిన బకాయిలు ఇంకా క్లియర్ చేయలేదని, అందుకే ప్రమోషన్స్ కూడా ముందుకు సాగడం లేదని సమాచారం. ఈ వివాదం కారణంగానే ప్రదీప్ సైలెంట్ గా తన తదుపరి ప్రాజెక్టులపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

నిజానికి ఈ సినిమాను ఎప్పుడో రిలీజ్ చేయాల్సింది. మొదట దీపావళికి ప్లాన్ చేశారు. ఆ తర్వాత డిసెంబర్, ఆపై వాలెంటైన్స్ డే.. ఇలా చాలాసార్లు డేట్లు మార్చారు. ఫైనల్ గా ఏప్రిల్ లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. కానీ ఇప్పుడు రెమ్యునరేషన్ సమస్యతో ఏప్రిల్ రిలీజ్ కూడా కష్టమే అనిపిస్తోంది. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్.జె. సూర్య ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.

'ఔఐఓ' పదే పదే వాయిదా పడుతుండటంతో ఇతర తమిళ సినిమాల రిలీజ్ డేట్స్ పై కూడా దీని ప్రభావం పడుతోంది. ఎందుకంటే ఈ సినిమా ఎప్పుడు వస్తుందో తెలియక మిగతా ప్రొడ్యూసర్లు తమ సినిమాల డేట్స్ అడ్జస్ట్ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అసలు ఈ బకాయిల వ్యవహారం ఎప్పటికి తేలుతుంది? ప్రదీప్ సినిమా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందనే దానిపై మేకర్స్ నుంచి అఫీషియల్ క్లారిటీ వస్తే కానీ అభిమానుల టెన్షన్ తీరేలా లేదు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.